TGTEL/26/A0320

# భారతీయ వెలుగు

జాతీయ తెలుగు దిన పత్రిక

గురువారం మార్చి 05, 2026 | సంపుటి :01 | సంచిక :46 | కరీంనగర్ | పేజీలు -12 | వెల-1

Hyderabad,KarimNagar, Warangal, Khammam, Nalgonda, Mahabub Nagar, Nizamabad, Gadwal, Medak, Vikarabad, Wanaparthy, Siddipet,






2లో

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌక మునక..

## 100 మందికిపైగా గల్లంతు?

## పెంటగాన్ నివేదిక లీక్..

అమెరికా వద్ద తగ్గిపోతున్న క్షిపణి నిల్వలు



2లో

### ఆ దేశాలపై అమెరికా

# యుద్ధం..

### రూ.లక్షల కోట్ల ఖర్చు!

విదేశీ యుద్ధాల్లో జోక్యాన్ని తగ్గించుకుంటామని అమెరికా పలు సందర్భాల్లో పేర్కొన్నప్పటికీ.. తాజాగా ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్ పై భీకర దాడులు కొనసాగిస్తోంది. మాజీ అధ్యక్షుల మాదిరిగానే డొనాల్డ్ ట్రంప్ కూడా పశ్చిమాసియాలో తన వ్యూహాలను అమలు చేస్తున్నారు. సెప్టెంబర్ 11, 2001 దాడుల తర్వాత మూడు దేశాలపై పూర్తిస్థాయి యుద్ధం చేసిన అమెరికా, రెండున్నర దశాబ్దాల్లో మొత్తంగా పది దేశాలపై సైనిక చర్య చేపట్టింది. ఇందుకోసం భారీగా ఖర్చు చేసింది.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

## ఇక పథకాల అమలు వారికి మాత్రమే.. కలెక్టర్లకు ఆదేశాలు



తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పథకాల అమల్లో అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా పేద వర్గాల ప్రజలను, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేలా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోంది. అయితే, పథకాల అమలు విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

సచివాలయంలో మంగళవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించాలని, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ఐదు దశల్లో అమలు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాల నుంచి అనర్హులను తొలగించాలని ఆమేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

అనర్హులకు పథకాలు చేరకుండా, ఒక్కరికే రెండుసార్లు లబ్ధి చేకూరకుండా ఇకపై ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి పథకానికీ ఫేస్ రికగ్నైజేషన్ వర్తింప చేయాలని స్పష్టం చేశారు.

## తిరుమల లడ్డూ కల్తీ అంశంపై చర్చ..

## శాసన మండలిలో గందరగోళం

- చర్చకు అనుమతి: శాసన మండలిలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాల తర్వాత ఛైర్మన్ మోషేను రాజు ఈ అంశంపై చర్చకు అనుమతించారు.
- సమయ కేటాయింపు: ఈ చర్చ కోసం మొత్తం ఒక గంట సమయాన్ని కేటాయించారు. ఇందులో వైకాపాకు 30 నిమిషాలు, తెదేపాకు 20 నిమిషాలు, ప్రభుత్వ వివరణకు 10 నిమిషాలు కేటాయించారు.
- హెరిటేజ్ ప్రస్తావన: స్వతంత్ర ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చర్చను ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆరోపణలు చేస్తూ, హెరిటేజ్ సంస్థ ప్రస్తావన తీసుకువచ్చారు.



2లో

అమరావతి: ఏపీ శాసన మండలిలో గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదాల అనంతరం తిరుమల లడ్డూ కల్తీ అంశంపై మండలి ఛైర్మన్ మోషేను రాజు చర్చకు అనుమతించారు. దీనికోసం మొత్తం గంట సమయం కేటాయిస్తున్నట్లు చెప్పారు. వైకాపాకు 30 నిమిషాలు, తెదేపాకు 20 నిమిషాలు, ప్రభుత్వం వివరణ ఇచ్చేందుకు 10 నిమిషాలు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

## జైల్లో నన్ను తీవ్ర

### ఇబ్బందులకు గురి చేశారు: బాల్క సుమన్

- వేధింపుల ఆరోపణ: క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సమయంలో మంత్రి వివేక్ తనను అనేక రకాలుగా వేధింపులకు గురిచేశారని సుమన్ ఆరోపించారు.
- ప్రాణహాని అనుమానం: ప్రస్తుత పరిణామాలను గమనిస్తుంటే తనను అంతమొందిస్తారేమోనన్న భయం కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
- జైలులో ఇబ్బందులు: జైలులో ఉన్న సమయంలో తనకు కనీసం మంచినీరు కూడా ఇవ్వలేదని, సరైన భోజనం పెట్టలేదని పేర్కొన్నారు.




2లో

## పిపిపి విధానంలో వైద్య కళాశాల పూర్తి

- మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి

పది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రెండు దశల్లో నిర్మాణం చేపడుతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.

2లో




### అగ్నిప్రమాదాల నివారణకు

## కఠిన చర్యలు




- బహుళ అంతస్థుల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి
- సవరణ బిల్లు ఆవశ్యకతను వివరించిన హోంమంత్రి అనిత

2లో

ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

### జగన్, భూమన, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు: పంచుమర్తి అనురాధ



అమరావతి: తిరుమల శ్రీవారిపై గతంలో జగన్ ప్రభుత్వం కక్షగట్టిందని తెదేపా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. టెండర్ నిబంధనలను సవరించి ఇష్టానుసారం వ్యవహరించారని విమర్శించారు. "అనేక భయంకరమైన రసాయనాలు కలిసి ఉన్నవాటికి ఆవు నెయ్యి అని పేరు పెట్టారు. రోజుకు 4లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సడలించారు.

2లో

## ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎం బెదిరిస్తున్నారు: హరీశ్‌రావు



2లో



## సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

2లో

- త్వరలోనే స్వయంగా డ్యామ్ ను సందర్శిస్తా
- ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు
- జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి
- పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష

# సంపాదకీయం

## న్యాయస్థానాలను ప్రశ్నించకూడదా?

'సుప్రీంకోర్టు సంస్థాగత ఆధిపత్యాన్ని దిగజార్చేందుకు, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాలను అడ్డుకోకపోతే, ప్రజల దృష్టిలో న్యాయవ్యవస్థ పవిత్రత క్షీణిస్తుంది. యువత లేత మనసులపై ప్రభావం చూపుతుంది.. మాపై తుపాకి కాల్చారు.. న్యాయవ్యవస్థ నెత్తురోడుతోంది.' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన 8వ తరగతి పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివరించినందుకు ఆయన ఏకంగా ఆ పుస్తకాన్నే నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. కనీసం డిజిటల్ రూపేణా కూడా ఈ పుస్తకం కనపడరాదని ఆయన ఆజ్ఞాపించారు. ఈ నిషేధాజ్ఞల తర్వాత కొన్ని లక్షల పుస్తకాలను ఎన్‌సీఈఆర్‌టీ ఉపసంహరించుకుంది. ఈ పాఠ్యపుస్తకం జిరాక్స్ కాపీలను అమ్ముతున్నందుకు ఒక పుస్తకాల షాపు యజమానిని పోలీసులు అరెస్టు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి.'న్యాయవ్యవస్థను అప్రతిష్టపాలు చేసేందుకు ఈ భూమి మీద ఏ ఒక్కరినీ నేను అంగీకరించే ప్రసక్తి లేదు' అని సీజేఐ అన్నారు. ఆ పాఠ్యపుస్తకంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్‌లో ఉన్నారు. న్యాయవ్యవస్థ మనసు గాయపరిచినందుకు మోదీ కూడా బాధపడ్డారు. అసలు ఇవన్నీ ఎవరు చూస్తున్నారు.. అని మోదీ అన్నట్లు అధికార వర్గాలే మీడియాకు వెల్లడించాయి. దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ సమావేశంలో కూడా మోదీ ఈ విషయం ప్రస్తావించారు. 'మన న్యాయవ్యవస్థలో అవినీతి ఉన్నదని మనమే 8వ తరగతి పిల్లలకు ఎలా చెబుతాం' అని మోదీ అన్నట్లు వార్తలు వచ్చాయి. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివాదాస్పద అధ్యాయాన్ని 8వ తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చినందుకు విచారం వ్యక్తం చేశారు. 'న్యాయవ్యవస్థ అంటే మాకెంతో గౌరవం ఉన్నది. ఉద్దేశపూర్వకంగా న్యాయవ్యవస్థను అవమానించాలని మేము అనుకోలేదు' అని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ ప్రొఫెసర్ దినేష్ ప్రసాద్ సక్లానీకి సుప్రీంకోర్టు నోటీసులు పంపింది.

భారత ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేసినట్లు ఈ మొత్తం ఉదంతం వెనుక న్యాయవ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసే కుట్ర ఉన్నదా? ఒక పద్ధతి ప్రకారం న్యాయవ్యవస్థ పట్ల ప్రజల గౌరవం తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? నిజానికి మోదీ ప్రభుత్వమే ఈ కుట్ర పన్నిందన్న అభిప్రాయం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. 'ఒక దశాబ్ద కాలంగా పాఠ్యపుస్తకాల్లో తమ సైద్ధాంతిక వైరస్‌ను వ్యాప్తి చేసేందుకు బీజేపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివరించడం అనేది యాదృచ్ఛికంగా జరగలేదు. కాని ఒక పద్ధతి ప్రకారం విద్యార్థుల మనసులను చెడగొట్టేందుకు ప్రయత్నం జరిగింది' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ అన్నారు. మోదీ స్వయంగా ఈ ప్రక్రియకు మార్గదర్శకత్వం వహించారని, ఆర్‌ఎస్‌ఎస్ దీని వెనుక ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు ఉన్నాయని ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టులో ప్రతిపక్షాల కేసులను వాదించే న్యాయవాదులు కపిల్ సిబాల్, అభిషేక్ సింఘ్వీ ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్ మరింత తీవ్రంగా పట్టించుకునేలా తమ వాదనలు వినిపించారు. ఏదో పెద్ద కుట్ర జరిగిందనే అభిప్రాయం కల్పించడంలో వారు కృతకృత్యులయ్యారు. 'ఈ దేశంలో అభివృద్ధి వేగంగా జరిగేందుకు న్యాయవ్యవస్థే ప్రధాన అడ్డంకి..' అని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ గతంలో అన్నమాటలు కూడా ఇదే సమయంలో ప్రస్తావనకు వచ్చాయి.

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

మొదటి పేజీ తరువాయి

'అర్హులకు కచ్చితంగా లబ్ధి జరగాలి. అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3లక్షల మంది అనర్హులను తొలగించగలిగామని కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను పటిష్టం చేయడంలో భాగంగా వాటిని సమీపంలోని వైద్య కళాశాలలకు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులను కచ్చితంగా చెల్లించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## అగ్నిప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ÷ర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, ఆధునిక రక్షణ విధానాలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. ఈ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

## జగన్, భూమన, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు: పంచుమర్తి అనురాధ

మొదటి పేజీ తరువాయి

నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించేశారు. టర్నోవర్ ఏడాదికి రూ.250 కోట్లు అని ఉన్న నిబంధనను రూ.150 కోట్లకు పరిమితం చేశారు. సాంకేతిక అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా టెండర్లు కట్టబెట్టారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చేశారు. టెండర్ నిబంధనల సడలింపుపై తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సంతకం చేశారు. నెయ్యి కల్తీ జరిగిందని ఎన్డీడీబీ నివేదిక ఇచ్చింది.

ఇది కుంభకోణమే కాదు.. హిందుత్వంపై దాడి. మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు" అని పంచుమర్తి అనురాధ అన్నారు.

## పిపిపి విధానంలో వైద్య కళాశాల పూర్తి

మొదటి పేజీ తరువాయి

వైసీపీ అరాచక పాలన కారణంగా సీట్ల సంఖ్య 11కి పడిపోయిందని, అయినా బెదిరింపులు ఆపడం లేదని విమర్శించారు. జగన్ ప్రైవేట్ కళాశాలల మాదిరిగా ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు ఇచ్చారన్నారు. రాబోయే రెండేళ్లలో పీపీపీ విధానంలో కళాశాలలు పూర్తి చేస్తామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. నాలుగు రోజుల విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను మొదలుపెట్టారు. ప్రైవేట్ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయడంపై తణుకు ఎమ్మెల్యే ఏ.రాధాకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. వైసీపీ హయాంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రగల్భాలు పలికారని, చాలా కళాశాలల్లో పునాదులు కూడా పూర్తి కాలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం.. ప్రభుత్వ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో సీట్లు అమ్మే పద్ధతిని తెచ్చిందని.. 10 కళాశాలలను ఆరంభించి మధ్యలో వదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వం వైద్య కళాశాలల నిధులను దారి మళ్లించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టిందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలను పీపీపీ విధానంలో త్వరగా పూర్తి చేయాలని సంకల్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు. 'పీపీపీలో కళాశాలల నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎప్పుడు పూర్తవుతుందో చెప్పండి. వైసీపీ పెట్టిన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను ఏం చేస్తారు' అని ప్రశ్నించారు. పీపీపీలో కళాశాలలు తీసుకునే వారిని జగన్‌మోహన్ రెడ్డి బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిచ్చారు. 17 కళాశాలల్లో 11 నాబార్డు కింద, 3 కేంద్ర ప్రభుత్వం, 3 సాస్కి కింద మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు అని అన్నారు. జగన్ హయాంలో కేవలం రూ.15 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని.. అందులో పులివెందుల కళాశాలకే దాదాపు రూ. 500 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 900 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టిందని మంత్రి వివరించారు. కళాశాలలు నిర్మించామని వైసీపీ అసత్యాలు చెబుతోందని మంత్రి విమర్శించారు. పార్వతీపురంలో భూసేకరణ కూడా చేపట్టలేదని అన్నారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎం బెదిరిస్తున్నారు: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన రావడం లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని పేర్కొన్నారు. "రెండున్నరేళ్లలో ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోంది. పరిస్థితులు అర్థం చేసుకునేలోపే అధికారులు బదిలీ అవుతున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్లు కూడా ఇప్పటికే నలుగురు మారారు. కలెక్టర్ల సదస్సులో సీఎం బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. సీఎం, మంత్రులకు నచ్చకపోతే అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎం బెదిరిస్తున్నారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి కూడా జాయిన్ చేసుకోవడం లేదు. కాంగ్రెస్ నేతల అవినీతి, బినామీలను త్వరలోనే బయటపెడతాం" అని హరీశ్‌రావు అన్నారు.

## సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సితక్క,వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ

విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6,7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు మరియు అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2,3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా

ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జూన్ 2 వ తేదీ వరకు భూసేకరణ పూర్తి చేయాలని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, , ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆందోల్ నియోజకవర్గం లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రులు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు.

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌక మునక..

మొదటి పేజీ తరువాయి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. శ్రీలంక తీరంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. తమ దేశ దక్షిణ తీరంలో మునిగిపోతున్న ఓ ఇరాన్ యుద్ధ నౌక (×=×ూ ణవఖు) నుంచి 32 మందిని రక్షించి, ఆసుపత్రిలో చేర్చినట్లు శ్రీలంకకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, ఏడుగురికి అత్యవసర చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు.

"గాలె తీరానికి 40 నాటికల్ మైళ్ల దూరంలో 'ఐఆర్ఐఎస్ దేనా' అనే ఇరాన్ యుద్ధ నౌక ప్రమాదంలో ఉన్నట్లు శ్రీలంక నౌకాదళానికి సమాచారం అందింది. వెంటనే సహాయక చర్యల కోసం నౌకలు, ఎయిర్‌ఫోర్స్ విమానాలను పంపాం. ఈ నౌకలో 180 మంది ఉన్నట్లు సమాచారం. వారిలో దాదాపు 30 మందిని రక్షించాం" అని విదేశాంగ మంత్రి విజిత హెరాత్ పార్లమెంటుకు తెలిపారు.

ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకున్న వేళ ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. నౌక ఎలా దెబ్బతింది? సిబ్బంది ఎలా గాయపడ్డారు? అనే వివరాలు తెలియరాలేదు. అయితే, ఈ నౌకపై జలాంతర్గామి దాడి జరిగిందని, 100 మందికిపైగా గల్లంతయ్యారని, 78 మంది గాయపడ్డారని అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. 'ఐఆర్ఐఎస్ దేనా'.. ఇరాన్ కొత్త యుద్ధ నౌకల్లో ఒకటి. ప్రస్తుతం అమెరికా ఆంక్షల జాబితాలో ఉంది. ఇటీవల విశాఖ తీరంలో నిర్వహించిన విన్యాసాల్లో పాల్గొని, తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

## పెంటగాన్ నివేదిక లీక్..

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో.. అగ్రరాజ్య (ఖూ) క్షిపణి నిల్వలకు సంబంధించిన కీలక నివేదికలు బయటకు వచ్చాయి. అందులో క్షిపణుల నిల్వలు తగ్గిపోతున్నట్లు (ూశీష వీఱఅంఅశ్రీవ ూశీఎఎ) పెంటగాన్ వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్‌సెప్టర్ క్షిపణులు, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ల నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ఎదుర్కోవడంలో ప్రస్తుతం ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ట్రంప్ మరో 10 రోజులు ఇలాగే దాడులు కొనసాగిస్తే అవి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో ఆయుధ, క్షిపణి నిల్వలను తిరిగి పెంచుకోవడానికి అధిక ఖర్చులను భరించాల్సి ఉంటుందని ఈ మేరకు పెంటగాన్ ట్రంప్‌నకు తెలిపినట్లు నివేదికలు వెల్లడించాయి. కీలకమైన ఆయుధాల కొరత వల్ల ఇరాన్ దాడులను తిప్పి కొట్టడం కూడా అసాధ్యంగా మారే అవకాశం ఉందని హెచ్చరించాయి. కొన్నేళ్లుగా ఇజ్రాయెల్, ఉక్రెయిన్ వంటి మిత్రదేశాలకు సైనిక సహాయం అందిస్తుండడంతో.. అమెరికా నిల్వలు తగ్గినట్టు తెలిపాయి.

అమెరికా కన్నేస్తే.. ప్రపంచ నేతలూ తప్పించుకోలేరు..!

అయితే ట్రంప్ తమ వద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నట్లు మంగళవారం ట్రూత్ వేదికగా పేర్కొన్నారు. ఇరాన్‌తో పోరాటానికి కావాల్సినన్ని ఆయుధ నిల్వలు ఉన్నాయన్నారు. ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లోనూ నిల్వ చేసినట్లు చెప్పారు. ఇరాన్‌పై దాడులు మరో 5వారాలు కానీ..అంతకంటే ఎక్కువకాలం కానీ కొనసాగొచ్చని పేర్కొన్నారు.

## ఆ దేశాలపై అమెరికా యుద్ధం..

మొదటి పేజీ తరువాయి

సెప్టెంబర్ 2001 తర్వాత 'ఉగ్రవాదంపై పోరు'కు సిద్ధమని ప్రకటించిన నాటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ అఫ్గానిస్థాన్‌పై యుద్ధం మొదలుపెట్టారు. 'ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్'తో మొదలైన ఆ సైనిక చర్య దాదాపు 20ఏళ్లు కొనసాగింది. అమెరికా చరిత్రలోనే సుదీర్ఘ యుద్ధంగా నిలిచింది. ఇరాక్‌పైనా దాడి చేసింది. 2001-2023 మధ్యకాలంలో బుష్, ఒబామా, ట్రంప్, బైడెన్‌ల హయాంలో సిరియా, యెమెన్, సోమాలియా, లిబియా, నైజీరియాలపై వైమానిక దాడులు జరిపింది. ఇటీవల వెనెజువెలాపై సైనిక చర్య చేపట్టిన అగ్రరాజ్యం, తాజాగా ఇరాన్‌పైనా మరోసారి భీకర దాడులు చేస్తోంది.

బ్రౌన్ యూనివర్సిటీ వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ ప్రకారం.. రెండున్నర దశాబ్దాల్లో అమెరికా యుద్ధాల కారణంగా దాదాపు తొమ్మిది లక్షలమందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వీరిలో దాదాపు సగం మంది సామాన్యులేనని చెప్పింది. ఆహారం, వైద్యం, యుద్ధ సంబంధిత వ్యాధులతో అనేక మంది మరణించినట్లు తెలిపింది.ఇలా రెండు దశాబ్దాలకుపైగా సైనిక చర్యల కోసం అమెరికా దాదాపు 5.8 ట్రిలియన్ డాలర్లు ఖర్చుపెట్టినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటితోపాటు రానున్న రోజుల్లో మాజీ సైనికుల ఆరోగ్య సంరక్షణ కోసం మరో 2.2 ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయని తెలుస్తోంది. మొత్తంగా 2001 నుంచి యుద్ధాలపై అమెరికా పెట్టే ఖర్చు సుమారు 8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా.

## తిరుమల లడ్డూ కల్తీ అంశంపై చర్చ.. శాసన మండలిలో గందరగోళం

మొదటి పేజీ తరువాయి

అనంతరం వైకాపాకు మద్దతుగా స్వతంత్ర ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చర్చను ప్రారంభించారు. నెయ్యి కల్తీ అంశంపై ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో హెరిటేజ్ ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై తెదేపా సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తిరుమల లడ్డూ కల్తీతో హెరిటేజ్‌కి ఏమాత్రం సంబంధం లేదని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ఆధారాలు లేకుండా పదేపదే ఇలాంటి ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబని నిలదీశారు. ఏ ప్రభుత్వ సంస్థలకూ నెయ్యి సరఫరా చేయకూడదని హెరిటేజ్ నిర్ణయించుకుందని ఆయన గుర్తు చేశారు. కానీ దాన్నే ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావిస్తూ తిరుమల లడ్డూ కల్తీ అంశంపై చర్చను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.

## జైల్లో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు: బాల్క సుమన్

మొదటి పేజీ తరువాయి




మందమర్రి పట్టణం: క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్ తనను అనేక రకాలుగా వేధింపులకు గురిచేశారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనను అంతమొందిస్తారేమోనని అనుమానంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు."జైల్లో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. మంచినీరు ఇవ్వలేదు. భోజనం సరిగ్గా పెట్టలేదు. జ్వరం వచ్చినా.. సరైన వైద్యం అందించలేదు. జైలు నుంచి బయటకు రాకుండా అనేక కుట్రలు చేశారు" అని ఆరోపించారు.

## ఎమ్మెల్యే నాగరాజుకు జన్మదిన శుభాకాంక్షలు

**వరంగల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మోహన్ గౌడ్, నేతలు**



**భారతీయ వెలుగు, వరంగల్, మార్చి 4:**
వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు జన్మదినాన్ని పురస్కరించుకొని, బుధవారం నేతలతో కలిసి వరంగల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్ల కట్టుబడి పనిచేస్తున్న నాయకుడిగా ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రజల సమస్యలను సమగ్రంగా తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేస్తున్న ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాగరాజు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో దీర్ఘాయుష్షు పొందాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అలంకరించాలని మోహన్ గౌడ్ మనసారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండలం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు శంకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు బోర్డుకు నూతన అధికారి.

### - జి.సునీల్ కుమార్.



**భారతీయ వెలుగు/శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు/ డి.సి పల్లి/మార్చి 3.**
డీసీపల్లి పొగాకు బోర్డ్ వేలం నిర్వహణ అధికారిగా జి.సునీల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొండేపిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. డీసీపల్లి అధికారిని కలిగిరికి బదిలీ చేశారు. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా తాను పనిచేస్తానని.. ఏ సమస్య అయినా తనకు చెప్పాలని నూతన అధికారి సునీల్ కుమార్ కోరారు.

## డెవలప్మెంట్ ఆఫీసర్ కు చెల్లించిన ఇంటి పన్ను



**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి/పెదపూడి):**
పెదపూడి మండల ప్రజా పరిషత్ కు సంబంధించిన ఇంటి పన్ను రూ.25 వేలు మండల పంచాయతీ డెవలప్మెంట్ అధికారి ప్రతాప్ కు అందజేశారు. బుధవారం ఎంపీడీవో కె నరేంద్ర రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి, ఏవో కలిసి డెవలప్మెంట్ ఆఫీసర్ కు ఇంటి పన్ను అందజేయడం జరిగింది.

## "డ్రగ్స్ వద్దు బ్రో"

### - పోలీసుల అవగాహన కార్యక్రమాలు.



**భారతీయ వెలుగు/శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా/మార్చి 4.**
నెల్లూరు జిల్లాను "డ్రగ్ ఫ్రీ" జిల్లాగా మార్చే లక్ష్యంతో ఎస్పీ డా.అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 988 ఈగల్ క్లబ్స్, 24 డ్రోన్లతో నిఘా పెంచారు. "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదంతో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నారు.

## చెడిపోయిన చేపలు విక్రయాలు. చేపల మార్కెట్ లో ఆకస్మిక తనిఖీలు.



**భారతీయ వెలుగు/శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.**
నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్ చేపల మార్కెట్లో కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ దినేశ్ బుధవారం ఉదయం ఆకస్మిక దాడులు చేశారు. పలు దుకాణాల్లో చెడిపోయిన చేపలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని పినాయిల్ పోసి నిర్వీర్యం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా కొనే ముందు నాణ్యతను పరిశీలించాలని తెలిపారు.

# ఖమ్మం కూల్చివేతల్లో ఆంధ్రా కోణం!

» వెయ్యి మంది బాధితుల్లో 600 నుండి 700 మంది
» ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చినవారే..

**భారతీయ వెలుగు ప్రతినిధి ఖమ్మం**
ఖమ్మం నగరం శివారులోని వెలుగుమట్ల వినోబా నగర్ భూదాన్ భూముల్లో జరిగిన ఇళ్ల కూల్చివేత ఉదంతం ఇప్పుడు ఒక కొత్త సామాజిక, రాజకీయ చర్చకు తెరలేపింది. ఇక్కడ ఇళ్లు కోల్పోయిన సుమారు వెయ్యి మంది బాధితుల్లో 600 నుండి 700 మంది వరకు ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చి స్థిరపడినవారని తేలింది. గత దశాబ్ద కాలంగా ఇక్కడే నివాసం ఉంటూ, స్థానిక రాజకీయ నేతల హామీలతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్న ఈ సెటిలర్ల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది.

» **భూదాన్ భూముల్ని పంచిపెట్టింది బీఆర్ఎస్ హయాంలోనే!**

స్థానిక రాజకీయ సమీకరణాలే ఈ అక్రమ నిర్మాణాలకు పునాది వేశాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఖమ్మం టౌన్కు చెందిన కొందరు కీలక నేతలు, మరికొందరు కమ్యూనిస్ట్



పార్టీల నాయకులు కలిసి ఈ భూదాన్ భూములను తమ అనుచరులకు, పేదలకు పంచిపెట్టారని బాధితులు చెబుతున్నారు. నాయకుల మాటలను నమ్మి, తమ కష్టార్జితాన్ని వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసిన వలస కార్మికులు ఇప్పుడు గూడు కోల్పోయి రోడ్డున పడ్డారు. అధికారుల కూల్చివేత సమయంలో కనీసం సామాన్లు సర్దుకోవడానికి కూడా సమయం ఇవ్వకపోవడం వారిని మరింత కుంగదీసింది.

» **నిజమైన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు -- నిజమైన అంటే?**

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిజమైన బాధితులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఈ హామీలో ఒక మెలిక ఉందనే వాదన వినిపిస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు రావాలంటే వారు స్థానిక పేదలై ఉండటంతో పాటు, ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదై ఉండాలి. తరతరాలుగా ఖమ్మం జిల్లాలో నివసిస్తున్న స్థానిక నిరుపేదలకు న్యాయం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, ఉపాధి కోసం వచ్చి ఇక్కడ ఇళ్లు కట్టుకున్న ఆంధ్రా వలసదారుల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు ఎవరికీ అర్థం కాని ప్రశ్న.

» **అందరికీ న్యాయం చేయాలంటున్న బాధితులు**

మానవత్వంతో ఆలోచించి, కేవలం లోకల్-నాన్ లోకల్ అనే తేడా చూడకుండా, ఇళ్లు కోల్పోయిన ప్రతి నిరుపేద కుటుంబానికి పునరావాసం కల్పించాలి అని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు పరిమితం కాకుండా, నిరాశ్రయులైన ఈ 700 కుటుంబాల కోసం బీఆర్ఎస్ అధిష్ఠానం పెద్ద మనసుతో పోరాడి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. మరి ప్రభుత్వం ఓట్లు లేవని.. అక్కడి వాళ్లు కాదని ..మెజార్టీ పేదల్ని పట్టించుకోకుండా వదిలేస్తుందేమో చూడాల్సి ఉంది.

# ఉపాధిహామీ కూలీలకు అలర్ట్.. అమల్లోకి కొత్త రూల్.. ఫాలో కాకుంటే డబ్బులు రావు..

ఉపాధి హామీ కూలీలకు ముఖ్య గమనిక. ఉపాధిహామీ పథకంలో కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. ఈ పథకంలో అక్రమాల జరగకుండా అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల అమల్లోకి తెచ్చింది.
ఇకపై ఉపాధిహామీ కూలీలకు ముఖ హాజరు (ఫేషియల్ అథెంటికేషన్)తప్పనిసరి చేసింది. మార్చి రెండో తేదీ నుంచి (సోమవారం) ఈ విధానం కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ నూతన విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది. గతంలో జాబ్ కార్డులో ఒకరి పేరు ఉంటే.. మరొకరు ఉపాధిహామీ పనులకు వెళ్లే పరిస్థితి ఉండేది. అలాగే మస్టర్లో దొంగ సంతకాలు చేసిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.
ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ-కేవైసీ విధానం తీసుకువచ్చింది. ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ప్రతి




ఉపాధిహామీ కూలీకి ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. ఈ కేవైసీ పూర్తి అయితే అక్రమాలకు పూర్తిగా స్వస్తి పలకవచ్చనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఈ కేవైసీ తీసుకువచ్చింది. 2025 అక్టోబర్ నెలలో ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు మెజారిటీ కూలీలకు ఈ ప్రక్రియను పూర్తిచేశారు.
మరోవైపు కొత్త విధానం ప్రకారం ఉపాధి హామీ పనికి వెళ్లిన సమయంలో పనులు చేసే ప్రదేశంలో కూలీలకు ఒక ఐడీని క్రియేట్ చేస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలు కూలీలకు మొదట ఫోటో తీస్తారు. పని పూర్తైన నాలుగు గంటల అనంతరం మరోసారి ఉపాధి హామీ కూలీల ఫోటోలు తీస్తారు. దీంతో పనులు పూర్తి చేసినట్లు సమాచారం అందుతుంది. వీటిలో ఏదీ మర్చిపోయినా ఉపాధి హామీ కూలీలకు బిల్లులు జమకావు. అయితే ఈ విధానం అమల్లో కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి.
మారుమూల గ్రామాల్లో నెట్వర్క్ సిగ్నల్లు సరిగా లేనటువంటి పరిస్థితి. దీంతో ఫేసియల్ రికగ్?్నషన్ విధానం అనేది కష్టతరంగా మారింది. అయితే పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీల ఫొటోలు తీయాలని.. ఆ తర్వాత సిగ్నల్ వచ్చే ప్రాంతానికి వెళ్లి యాప్లో అప్లోడ్ చేయాలని అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచిస్తున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో పారదర్శకత కోసమే కొత్తగా ముఖ హాజరు విధానం తెచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. ఈ విధానంతో ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందుతాయని.. అలాగే ఉపాధిహామీ పథకం సిబ్బందికి చాలా సమస్యలు తగ్గిపోతాయని చెప్తున్నారు.

# ఆహార ఉత్పత్తుల పెంపక ప్రోత్సాహమే అనారోగ్య పరిస్థితులు ఉత్పన్నం: ఎమ్మెల్యే నల్లమిల్లి

**- అనపర్తి(అసెంబ్లీ సమావేశం, అమరావతి) అవినీతి పై నిఘా**

అసెంబ్లీ సమావేశంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మరోసారి తమ గళాన్ని వినిపించారు.కౌలు రైతుల సమస్యలు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం, ప్రకృతి వ్యవసాయంలో ఉన్న సిబ్బందికి జీతాలు వంటి సమస్యలు సమావేశంలో లేవనెత్తారు.బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ సీఎంఆర్ కి ధాన్యం అమ్మిన 24 గంటల్లోపు డబ్బులు చెల్లించడంతో రైతులు చాలా ఆనందంగా ఉన్నారని చెప్పారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వడంలో కొన్ని సాంకేతిక పరమైన, మరికొన్ని న్యాయపరమైన ఇబ్బందులు ఉండటంతో పూర్తిస్థాయిలో సిసి ఆర్సి కార్డులు ఇవ్వలేకపోవడం జరుగుతుందని ఆయా భూ యజమానులు దగ్గర నుండి అనుమతి కావాలనే నిబంధన ఉండడంతో కౌలు రైతులకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నామని తెలిపారు. ఆనాడు లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉండగా ఆహార ఉత్పత్తులు పెంచాలని




ఎంతో పురుగుమందులు, ఎరువుల వాడకాలు పెద్ద ఎత్తున ప్రోత్సహించి తద్వారా ఆహార ఉత్పత్తిలో పెంచడం జరిగిందని అయితే దాని వలన నేడు అనారోగ్య పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ముఖ్యంగా క్యాన్సర్, డయాబెటిస్ తదితర రోగాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో తెలపాలని మంత్రిని ఎమ్మెల్యే నల్లమిల్లి కోరడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ముందుకు వెళుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా మొన్నటి బడ్జెట్లో 208 కోట్లు కేటాయించడం జరిగిందని అయితే ఈ మొత్తం సరిపోతుందా లేదా పరిశీలించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆహార ఉత్పత్తులకు చేస్తున్న రైతులకు సరైన మార్కెటింగ్ సహకారం లేదని మార్కెట్ ధర లభించిన పక్షంలో వారు నిరుత్సాహానికి గురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా లేదా ప్రైవేట్ రిటైల్ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ఆలోచన చేయాలని ఎమ్మెల్యే సంబంధిత మంత్రిని కోరారు. ప్రకృతి వ్యవసాయంలో ఉన్న గ్రామస్థాయి సిబ్బందికి 4500 నుండి 6500 వరకు జీతం చెల్లిస్తున్నారని ఇది సరిపోని పరిస్థితిలో పూర్తి సమయం వెచ్చించకుండా రైతులతో మమేకం కాలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. జీతాలు పెంచే ప్రతిపాదన ఏదైనా ఉందా అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.

# ఎన్నికల్లో ఇచ్చిన మ్యానిఫేస్టోను

### - అంచల వారీగా అన్ని హామీలు అమలు చేస్తాం
### - అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**భారతీయ వెలుగు:చీఫ్ బ్యూరో/వికారాబాద్, మార్చి:4,**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఇచ్చిన మ్యానిఫేస్టోను అంచల వారీగా అన్ని హామీలు అమలు చేస్తామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలానికి చెందిన 72 కళ్యాణలక్ష్మి,9 షాదిముబారక్ చెక్కులను, 30 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఈరోజు మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులను ఉద్దేశించి స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చాం. ఆరు గ్యారంటీలలో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ జరిగిందని, మిగిలిన గ్యారంటీల ను అమలు







చేద్దామని ఉన్నా గతంలో పదేళ్ళు అధికారంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ప్రస్తుత బడ్జెట్లో ఎక్కువ భాగం అప్పులకు సంబంధించిన అసలు, మిత్తిలకే పోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థుడు కాబట్టి ఇప్పు డిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడుతుందని తెలిపారు.
రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు చక్కబడ గానే ఇంకో ఆరు నెలల తరువాత ఇచ్చిన మాట ప్రకారం కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారుల కు తులం బంగారం, కాలేజీ లకు వెళ్ళే ఆడ పిల్లలకు స్కూటీ ఇవ్వడం జరుగుతుందన్నారు.
దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు వస్తాయి. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందిస్తున్నారు.
గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ళు అని పేదలను మోసం చేసింది. మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ వైయస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఎలా అయితే ప్రతి గ్రామంలో పరిపూర్ణంగా అందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఎలా మంజూరు అయ్యాయో అదేవిధంగా ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి నిరుపేదకు కూడా ఇళ్ళు అందు తుందని, కళ్యాణలక్ష్మీ, షాధీముబారక్ ల మంజూరు విషయంలో మీరు ఏ మధ్యవర్తుల దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేదు. దరఖాస్తు చేసుకుంటే నేరుగా మీ పేరు మీద చెక్కు వస్తుంది. వచ్చే మూడేళ్ళే కాదు తరువాత మరో అయిదేళ్ళు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అధికారంలోకి ఉంటుందని తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం స్పష్టత

పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. భారత్ లో చమురు నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ యుద్ధం సుమారు నెలరోజులపాటు కొనసాగవచ్చని చెప్పడంతో..
చమురు నిల్వలపై ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోతే ధరలు గణనీయంగా పెరుగుతాయన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. ధరల పెంపుపై కేంద్రప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి. చమురు, గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేశాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో చమురు నిల్వలు 45 రోజులకు సరిపడా ఉన్నాయని, చమురు దిగుమతి కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని కేంద్రవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఎల్ఎన్ జీ, ఎల్ పీజీ దిగుమతుల కోసం




ప్రత్యామ్నాయాలు చూస్తున్నట్లు వెల్లడించాయి.

» పెట్రోల్ బంకులకు పెరిగిన రష్

ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో హార్మూజ్ జలసంధి మూతపడిన విషయం తెలిసిందే. దీంతో వేలాది చమురు షిప్పులు సముద్రంలోనే నిలిచిపోయాయి. హార్మూజ్ జలసంధి సమీపంలో వేలాది చమురు నౌకలు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకున్నాయి. ఇవన్నీ ఎగుమతి కావాలంటే యుద్ధం ఆగాలి. అందుకు కనీసం 40 రోజులు సమయం పడుతుందని అంచనా. అక్కడి నుంచి చమురు రాకపోతే మనదగ్గరి నిల్వలు అయిపోతే ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్ లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో మనవద్ద పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వార్తల నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. హైదరాబాద్ లో వాహనదారులు వాహనాల్లోనే కాక.. బాటిల్స్ లోనూ పెట్రోల్ ఫిల్ చేయించుకుంటున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# వేం నరేందర్ రెడ్డి కె రాజ్యసభ..!

» సీఎం రేవంత్ మాట నెగ్గుతుందా...?

**భారతీయ తెలుగు ప్రతినిధి**
పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషిచేసిన వేం నరేందర్ రెడ్డి కి రాజ్యసభ సీటు ఇప్పించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలని అధిష్టానంపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం. సౌమ్యుడు, స్నేహశీలి, ఆప్యాయంగా నవ్వుతూ పలకరించే వ్యక్తి వేం నరేందర్ రెడ్డి, సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి కాబట్టి కార్యకర్తలకు నాయకులకు నమ్మకం పెరగాలంటే ఏం నరేందర్ రెడ్డి కి రాజ్యసభ ఇవ్వాల్సిందేనని అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. కష్టపడిన వ్యక్తికి కాంగ్రెస్ లో మంచి గుర్తింపు వస్తుందని ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అదిష్టానం ముందు వివరించినట్లు సమాచారం.






తెలంగాణలో జరగనున్న రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. శాసనసభలో ఉన్న బలాబలాల దృష్ట్యా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పోటీకి దిగినా దిగకపోయినా ఈ రెండు స్థానాలు కాంగ్రెస్ వశం కావడం ఖాయం. అయితే, ఈ సులభమైన విజయం కంటే, పార్టీలో ఈ సీట్ల కోసం సాగుతున్న అంతర్గత పోటీ ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. కేవలం రెండు స్థానాల కోసం ఏకంగా 16 మంది సీనియర్ నేతలు రేసులో ఉండటం కాంగ్రెస్ హైకమాండ్‌కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాలుగా మారింది.
రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ రెండు స్థానాల్లో ఒకటి ఖచ్చితంగా హైకమాండ్ కోటా కింద ఢిల్లీ నేతలకు కేటాయించే అవకాశం ఉంది. జాతీయ స్థాయిలో పార్టీ అవసరాల దృష్ట్యా ఏఐసీసీ ముఖ్య నేతలను ఇక్కడి నుంచి పెద్దల సభకు పంపవచ్చని చర్చ జరుగుతోంది. ఇక మిగిలిన ఒక్క స్థానంపైనే రాష్ట్ర నేతలందరి కన్ను పడింది. ఈ రెండో సీటును తన ముఖ్యమంత్రి కోటా కింద తనకు అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డికి ఇప్పించుకోవాలని రేవంత్ రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది.

**వేంకు న్యాయం చేయాలని రేవంత్ పట్టుదల**

వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపడం రేవంత్ రెడ్డికి ఒక రాజకీయ అవసరంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటి నుంచి వేం ఆయనకు అత్యంత నమ్మకస్తుడైన సహచరుడిగా, వ్యూహకర్తగా ఉంటూ వస్తున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రికి సలహాదారుగా ఉన్న వేంకు పార్లమెంటు సభ్యత్వం కల్పించడం ద్వారా, తన మాట కాంగ్రెస్ అధిష్టానం వద్ద ఎంత బలంగా ఉందో చాటిచెప్పాలని రేవంత్ భావిస్తున్నారు. వేం నరేందర్ రెడ్డికి సీటు సాధించుకోగలిగితే, రేవంత్ రెడ్డి పలుకుబడి గట్టిగానే ఉందని, పార్టీలో ఆయన అప్రహతిహత నాయకత్వం కొనసాగుతోందని సంకేతాలు వెళ్తాయి.

**హైకమాండ్ ఆలోచన ఏమిటో?**

ఈ ప్రయత్నం అంత సులభంగా సాగేలా లేదు. పార్టీ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్న సీనియర్ నేతలు తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలను హైకమాండ్ పరిగణనలోకి తీసుకుంటే వేం ఎంపికపై సందిగ్ధత నెలకొనే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి తన విజ్ఞప్తిని ఢిల్లీ స్థాయిలో ఎలా ఒప్పిస్తారో, అందరినీ కాదని తన అనుచరుడికి పట్టం కట్టించుకోగలరో లేదో వేచి చూడాలి. ఈ నియామకం రేవంత్ రెడ్డి రాజకీయ చాణక్యానికి , హైకమాండ్ వద్ద ఆయనకున్న క్రెడిబిలిటీకి ఒక లిట్మస్ టెస్టుగా మారనుంది.

# తెలంగాణ రాజ్యసభ సీట్లు బీసీలకే కేటాయించాలి:

**– దుంద్ర కుమారస్వామి డిమాండ్**
**– సామాజిక న్యాయం ..... ప్రాతినిధ్యంలో కనిపించాలి**

**భారతీయ వెలుగు,హైదరాబాద్, మార్చి 04:**
తెలంగాణ నుంచి ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీ నేపథ్యంలో, ఆ రెండు సీట్లను బీసీలకు కేటాయించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుంద్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కాచిగూడలో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆల్ ఇండియా



కాంగ్రెస్ కమిటీ అభ్యర్థులను ప్రకటించబోతున్న ఈ సమయంలో బీసీ వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోందన్నారు. దశాబ్దాలుగా బీసీలు రాజకీయ అణిచివేతకు గురవుతున్నారని, జనాభాలో గణనీయ శాతం ఉన్నప్పటికీ చట్టసభల్లో తమ వంతు వాటాను పొందలేకపోతున్నారనే వాస్తవం ఆందోళన కలిగించేదిగా ఉందన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు ఇద్దరు సమర్థులైన బీసీ నాయకులను ఎంపిక చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన సామాజిక న్యాయ వైఖరిని స్పష్టంగా నిరూపించుకోవచ్చని అభిప్రాయపడ్డారు.
బీసీల ప్రాతినిధ్యం 15 శాతం దాటని పరిస్థితుల్లో ఉన్నత సభల్లో అవకాశాలు కల్పించడం ద్వారానే నిజమైన రాజకీయ భాగస్వామ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం పదవుల కేటాయింపుల్లో ప్రతిబింబించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తీసుకునే నిర్ణయం కేవలం రెండు స్థానాల భర్తీ మాత్రమే కాకుండా, బీసీల రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే కీలక చర్యగా భావించబడుతోందన్నారు.
ఈ కార్యక్రమంలో జాతీయ గౌడ సంఘం అధ్యక్షుడు ఐలయ్య, డీవీవీ సత్యనారాయణ, రాజేష్ రమణా తదితరులు పాల్గొన్నారు.

# నేనున్నాను మిత్రమా:

» మోడీకి, పుతిన్ హామీ
» సంక్షోభం వేళ భారత్‌కు రష్యా భరోసా...!

**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత ఇంధన భద్రత ప్రమాదంలో పడింది. యూఎస్ ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడి చేయడం గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలకు కారణమైంది.
మరోవైపు అమెరికా మిత్రదేశాలైన యూఏఈ, కువైట్, ఖతార్, బహ్రైయిన్, సౌదీ అరేబియాలపై ప్రతీకార దాడులు చేస్తోంది. చమురు రవాణాకు అత్యంత కీలకమైన "హార్మూజ్ జలసంధి"ని ఇరాన్ మూసివేసింది. ప్రపంచంలో 20 శాతం చమురు రవాణా ఈ మార్గం గుండానే



జరుగుతుంది. ఇప్పుడు ఈ ఇరుకైన సముద్ర మార్గాన్ని ఇరాన్ మూసేయడంతో భారత్‌కు ఇబ్బందులు ఎదురవ్వబోతున్నాయి.బి
ఇదిలా ఉంటే, సంక్షోభ సమయాల్లో భారత్‌కు అండగా నిలిచే మిత్రదేశం రష్యా మరోసారి ముందుకు వచ్చింది. గల్ఫ్ ప్రాంతాల నుంచి చమురు రవాణాకు ఇబ్బంది ఎదురైతే తాము సరఫరా చేస్తామని రష్యా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత చమురు భద్రతకు హార్మూజ్ జలసంధి చాలా కీలకం. ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాలో దాదాపుగా 20 శాతం ఈ మార్గంపైనే ఆధారపడి ఉంది. భారత్ కు వచ్చే ముడి చమురు, ఎల్పీజీ దిగుమతుల్లో సుమారు సగం ఈ మార్గం గుండా వస్తుంది.బి
ప్రస్తుతం భారత్ కు తక్షణ సంక్షోభం లేదు. మన వద్ద ఉన్న 25 రోజుల ముడి చమురు, మరో 25 రోజుల పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయి. ఈ మొత్తం 50 రోజుల వినియోగానికి సరిపోతుంది. దేశీయ అవసరాలకు తగినంత నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ముడి చమురు దిగుమతిదారుగా భారత్ ఉంది. నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం భారత్ సొంతం. ఐదో అతిపెద్ద పెట్రోలియం ఎగుమతిదారుగా కూడా భారత్ ఉంది. గల్ఫ్ నుంచి పరిస్థితులు విషమిస్తే, రష్యా నుంచి దిగుమతి చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# హన్మకొండ లో 'క్రెసెంట్ కార్నివాల్ ఎక్స్‌పో'ను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి

**భారతీయ వెలుగు వరంగల్ మార్చి 4**
హన్మకొండ నగరంలోని జకారియా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన క్రెసెంట్ కార్నివాల్ (ఆహారం,షాపింగ్,ఆటలు) స్టాళ్లను బుధవారం కాంగ్రెస్ యువ, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కార్నివాల్ నిర్వాహకురాలు నాజియా ఫిర్దౌస్, ఇతర నాయకులు కూడా పాల్గొన్నారు. హన్మకొండ నగరంలో ఇటువంటి స్టాల్‌ను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమైన చొరవ అని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. నిర్వాహకులను అభినందించారు. వరంగల్ మరియు హన్మకొండ ప్రజలు ఈ కార్నివాల్ ఎక్స్‌పో నుండి ప్రయోజనం పొందాలని కోరారు.గత మూడు సంవత్సరాలుగా రంజాన్ సందర్భంగా ఇటువంటి కార్నివాల్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు నాజియా ఫిర్దౌస్ తెలిపారు.ఈ క్రెసెంట్ కార్నివాల్‌లో, మహిళల నగలు,పని దుస్తులు, పర్సులు, సౌందర్య సాధనాలు, చొక్కాలు,సల్వార్‌లు మరియు ఇతర అన్ని రకాల దుస్తులను షాపింగ్ కోసం ఉంచారు.దీనితో పాటు,అన్ని రకాల హారాలు కూడా అమ్మకానికి ఉంచబడ్డాయి.పెద్దలు మరియు పిల్లలకు కూడా బట్టలు ఉన్నాయి.ఈ కార్నివాల్ ఎక్స్‌పో మార్చి 5 వరకు కొనసాగుతుందని ఆయన అన్నారు. హన్మకొండ, వరంగల్ ప్రజలు, ముఖ్యంగా మహిళలు, బాలికలు ఈ కార్నివాల్ ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా సయ్యద్ ఇస్మాయిల్ అరేబియన్ మండి హౌస్ యజమాని, ఇతరులు సహా పెద్ద సంఖ్యలో మహిళలు, బాలికలు తదితరులు హాజరయ్యారు.

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా

» అలరించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు
» చదువుతోనే సమాజంలో మార్పు
» ఆర్బీవిఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె.అచ్యుత దేవి

**భారతీయ వెలుగు, హైదరాబాద్,మార్చి 04:**





విద్యార్థులు డ్యాన్సతో హోరెత్తించారు. ఆడిపాడి సందడి చేశారు. బర్కతపురలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో ఏకోస్ ఉత్సవ్ పేరిట నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. మణిపూరి నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలతో విద్యార్థులు అందరిలో ఉత్సాహాన్ని నింపారు. కాళాశాలలో నిర్వహించిన ఈ వేడుకలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగాల్లో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైందని విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ సుమిత్ర జైస్వాల్, కె.సింధూరి, అద్విత, అన్నపూర్ణ, విధి సజ్జా, జ్యోష్నా, బి.ప్రవల్లిక, హరిత, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ లక్ష్మణ్ రావు నేతృత్వంలో హోలీ వేడుకలు

**భారతీయ వెలుగు,హైదరాబాద్, మార్చి 04:**





బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో బుధవారం పబ్లిక్ గార్డెన్స్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి హోలీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాంప్రదాయ రంగులు చల్లు కుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుక వివిధ వయసుల పౌరులలో కమ్యూనిటీ బంధం మరియు సాంస్కృతిక ఐక్యతను నొక్కి చెప్పింది. కిషన్ గుంజ్ నాలా ప్రాంతం లో స్థానిక నివాసితులతో కలసి ఆయన హోలీ జరుపుకున్నారు. సమాజ సంబంధాలను బలోపేతం చేయడం మరియు అట్టడుగు స్థాయిలో పండుగ స్ఫూర్తిని పంచుకోవడంపై దృష్టి ఆయన దృష్టి సారించారు.
ఈ సందర్భంగా ఎన్. ఆర్. లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు తన హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ఐక్యత, సామరస్యం, సామూహిక వేడుక యొక్క ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు.

# స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలకు మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి




**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి/రాజమహేంద్రవరం):**
ఎటువంటి రాజకీయ,పోలీస్ ఒత్తిళ్లు లేకుండా అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట, వెంకటాపురం,సుభద్రంపేట గ్రామాల్లో ఈ నెల 5 జరిగే మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అధికారులను కోరారు.బుధవారం సహకార సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయంలో కోర్ట్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను మాజీ ఎమ్మెల్యే సత్తి అందజేశారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత వైఖరి పాటించాలని, ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు లోను కాకుండా తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించే విధంగా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే సత్తి వినతి పత్రం అందజేశారు.ఆయనతో పాటు రంగంపేట జెడ్పిటిసి పేపకాయల రాంబాబు ఉన్నారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
గురువారం మార్చి 05, 2026

## ఇద్దరి మధ్య సంబంధం..వ్యక్తిగత విభేధం..

» మహిళ హత్య చేసిన కేసును చేదించిన పోలీసులు..
» వివరాలు వెల్లడించిన మోమిన్ పేట్ సిఐ వెంకట్
» పోలీసులను అభినందించిన ఎస్పీ స్నేహ మెహ్రా.

**భారతీయ వెలుగు:చీఫ్ బ్యూరో/వికారాబాద్,మార్చి:4,**







ఇరువురి మధ్య గల సంబంధం బయటపడుతుందని భయంతో, వ్యక్తిగత విభేదాలతో ఆగ్రహానికిలోనై మహిళను గొంతు కోసి హత్య చేసినట్లు సీఐ వెంకట్ తెలిపారు.నవాబ్ పేట్ మండలం ఎత్ రాజ్ పల్లి గ్రామానికి చెందిన మినేపల్లి బాలమణి అనే మహిళ హత్య కేసును నవాబ్ పేట్ పోలీసులు ఛేదించారు.ఈ కేసుకి సంబంధించిన వివరాలను మీడియాకు మోమిన్ పేట్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ వెంకట్ వెల్లడించారు. నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ గ్రామం పులికుంట గుట్ట సమీపంలోని ఓ వెంచర్ లో ఈనెల (మార్చి)2వ తేదీన మీనేపల్లి బాలమణి అనే మహిళ హత్య జరిగింది.భర్తకు దూరంగ శంకర్ పల్లిలో కుటుంబంతో కలిసి మృత్యురాలు నివాసం ఉంటుంది. ఈ నేల 1తేదీన ఎల్లకొండ గ్రామంలో జరుగుతున్న శ్రీ పార్వతీ పరమేశ్వరుల జాతర కోసం తన అక్క,చెల్లెలుతో కలిసి వచ్చింది. ఎల్లకొండ గ్రామానికి చెందిన నిందితుడు నాయకుడి శ్రీనివాస్ కు మృత్యురాలు మినేపల్లి బాలమణికి గతంలో నుండే పరిచయం.ఇరువురి మధ్య గల సంబంధం బయట పడుతుందని భయంతో,వ్యక్తిగత విభేదాలతో నిందితుడు పక్కపన్నాగంతో 2 తేదీన ఆదివారం అర్థరాత్రి నిండుతుడు మృత్యురాలు బాలమణిని ఎలాగైనా చంపి వదిలించుకోవాలని తన స్కూటీపై ఎక్కించుకొని ఎల్లకొండ గ్రామ శివారు పులికుంట గుట్ట సమీపంలోకి తీసుకెళ్లి తన దగ్గర ఉన్నటువంటి ఆయుధంతో గొంతు కోసి హత్య చేసి మృత్యురాలు దెగ్గర ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, సెల్ ఫోన్ తో అక్కడ నుండి పరారయ్యాడు. అదే రోజు కుమారుడు తన తల్లి కనిపించడం లేదని గ్రామస్తులకు,తెలిసిన వారికి సమాచారం అందించాడు. ఎల్లకొండ గ్రామ శివారులో ఓ మహిళ మృత్యదేహం లభ్యం కావడంతో సమాచారం అందుకొని ఘటన స్థలానికి మృత్యురాలు కుమారుడు శేఖర్ చేరుకున్న ఆ మృతదేహం తన తల్లిదేనని ధ్రువీకరణ చేసి పోలీసులకు పిర్యాదు చేశాడు.కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై పుండ్లిక్ కేసు నమోదు చేశారు. మోమిన్ పేట్ సీఐ వెంకట్ తదుపరి విచారణ నిమిత్తం నివేదిక ఇవ్వడం జరిగిందని చెప్పారు. దర్యాప్తులో భాగంగా శాస్త్రీయ, సాంకేతిక సమాచారంతో నిందితుడు నాయకుడి శ్రీనివాస్ ఎల్లకొండ గ్రామస్తుడు అని గుర్తించి అరెస్ట్ చేసి వికారాబాద్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలించడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా నిందితుడు మృత్యురాలి నుండి అపహరించిన బంగారం,వెండి,ఫోన్ ని రికవరీ చేసినట్లు తెలిపారు.ఇట్టి కేసును చేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు.

## వ్యవసాయ పొలంలో జింక ప్రత్యక్షం

సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం సాయంత్రం జింక ప్రత్యక్షమైంది. అడవి నుంచి తప్పిపోయి వచ్చిన ఈ జింక, పెట్రోల్ బంకు వెనుక ఉన్న వరి పొలంలోని బురద మడిలో దిగబడిపోయింది. గమనించిన రైతులు వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫారెస్టు అధికారులు జింకను సురక్షితంగా బయటకు తీసి, సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు.

## ఆగివున్న కారును వేగంగా ఢీకొన్న కారు

**- నుజ్జునుజ్జు అయిన కారు...ఐదుగురు దుర్మరణం**
**- బృతులంతా బెంగళూరు వాసులుగా గుర్తింపు**

చిత్తూరు జిల్లాలోని పలమనేరు శివారులో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలమనేరు జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని ఓ కారు వెనుక వైపు నుంచి అత్యంత వేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ కారు పూర్తిగా ధ్వంసమైంది. మృతులు బెంగళూరు నగరంలోని రాజాజీ నగర్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వారు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చిత్తూరు జిల్లా పోలీసులు తెలిపారు.మృతులను మోహన్ దాస్ (71),నాగరాజారావు (61),కుసుమ (61),జయంతి (59),పూజ (33)గా గుర్తించారు.పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం ఇచ్చారు. పలమనేరు ప్రమాదంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రమాదానికి కారణం కారుడ్రైవర్ నిర్లక్ష్యమా..? ఇతర సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా..? అనే కోణంలో జిల్లా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారులపై వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనతో పలమనేరు ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

## అగ్నిప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

**- బహుళ అంతస్థుల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి**
**- సవరణ బిల్లు ఆవశ్యకతను వివరించిన హోంమంత్రి అనిత**

ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ÷ర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు.

# గ్రహణములు - దర్భలు- విశిష్టత ....!!

» దర్భను గూర్చి తప్పక తెలుసుకోవలసిన ముఖ్య విషయములు:
» దర్భ గడ్డి ఏ విధంగా ఆవిర్భవించింది?
» ఏ యే సందర్భములలో దర్భని తప్పక ఉపయోగించాలి?
» దర్భలు మానవ శరీరమునకు ఏ విధంగా ఉపయోగకరం?
» పురాణములలో దర్భ గురించి తెలిపిన విషయమేమీ?
» వేమన గారు దర్భను గూర్చి వ్రాసిన పద్యమేమి?
» మనకున్న పవిత్రమయిన వృక్ష సంపదలలో గడ్డి జాతికి చెందిన "దర్భ" ముఖ్యమయినది.




ఈ దర్భలో చాలా జాతులున్నాయి. వీటిలో దర్భ జాతి దర్భను అపరకర్మలకు, కుశ జాతి దర్భను శుకర్మలకు, బర్హిస్సు జాతి దర్భను యజ్ఞయాగాది శ్రౌత క్రతువులకు, శరము (రెల్లు, ఈ పేరు వినగానే నాకు రెల్లుపూల పానుపు గుర్తుకొస్తుంది) జాతి దర్భను గృహ నిర్మాణాలకు వినియోగించాలని ధర్మశాస్త్రాలు చెపుతున్నాయి.

**» దీని ఆవిర్భావం వెనుక అనేక కథలున్నాయి. కొంతమంది దీనిని విశ్వామిత్రుని సృష్టిగా పరిగణిస్తారు.**

కూర్మ పురాణం ప్రకారం, విష్ణుమూర్తి కూర్మావతారంలో మందర పర్వతాన్ని (క్షీరసాగర మధనం సందర్భములో) మోస్తున్నప్పుడు, ఆ పర్వత రాపిడికి కూర్మము వంటిమీద ఉండే కేశములు సముద్రములో కలిసి అవి మెల్లిగా ఒడ్డుకు కొట్టుకొనిపోయి కుశముగా మారాయనీ, అమృతం వచ్చినప్పుడు కొన్ని చుక్కలు ఈ కుశ అనే గడ్డి మీద పడటం వలన వాటికి అంత పవిత్రత సంతరించుకుంది అనీ చెప్పబడింది.

**» వరాహ పురాణం ప్రకారం, ఈ దర్భలు వరాహావతారములో ఉన్న శ్రీమహావిష్ణువు శరీర కేశములని చెప్పబడింది.**

అందువలననే దర్భ గడ్డిని శ్రీ మహావిష్ణువు రూపములని జనులు భావించి భాద్రపద మాసంలో దర్భాష్టమి నాడు వీటికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.
వీటికి దేన్నయినా శుద్ధి చేసే శక్తి ఉందని నమ్మిక. ఈ నమ్మకాన్ని నిజం చేస్తూ శాస్త్రవేత్తలు వీటిని విరేచనాలు, రక్తస్రావం, మూత్రపిండాలలో రాళ్ళు, మూత్రవిసర్జనలో లోపాలు మొదలయిన వానికి మందుగా వాడుతున్నారు.

**» అలానే ముంజ పర్వతం మీద ఉండే దర్భ అతిసారాది రోగాలకు ఔషధమని అథర్వణ వేదంలో చెప్పబడింది.**

అసలు దర్భ అన్న పదం వినగానే మనకు గుర్తుకొచ్చేది గ్రహణ కాలం. ఆ సమయంలో అన్నిటి మీదా దర్భను ఉంచడం మనకు అలవాటు. కానీ అలా చేయటం వెనుక ఉన్న అసలు రహస్యమేమిటంటే:

సూర్య, చంద్ర గ్రహణ సమయాలలో కొన్ని హానికరమయిన విష కిరణాలు భూమి మీదకు ప్రసారమవుతాయని ఈనాటి విజ్ఞానశాస్త్రం నిరూపిస్తోంది. ఇలాంటి వ్యతిరేక కిరణాలు దర్భల కట్టల మధ్యలోంచి దూరి వెళ్ళలేకపోతున్నాయని ఇటీవల కొన్ని పరిశోధనలలో కూడా తేలింది.

# రాహుల్ గాంధీకి మంద కృష్ణ మాదిగ లేఖ

**- మాదిగ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ అణచివేస్తోందన్న మంద కృష్ణ**
**- మాదిగలకు రాజ్యసభ సీటు కేటాయించాలని డిమాండ్**
**- సీడబ్ల్యూసీలో ఒక్క మాదిగ కూడా లేరని విమర్శ**



**భారతీయ వెలుగు ప్రతినిధి హైదరాబాద్**
కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజిక వర్గాన్ని రాజకీయంగా అణచివేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. మాదిగలకు రాజ్యసభ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు.
తెలంగాణకు చెందిన మాదిగ సామాజిక వర్గ నేతకు కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా మాదిగలకు టికెట్లు ఇవ్వలేదని, ఫలితంగా ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణ నుండి మాదిగల గొంతు వినిపించే వారే లేకుండా పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఒక్క మాదిగ కూడా లేకపోవడం వారి పట్ల పార్టీకి ఉన్న వివక్షకు నిదర్శనమని మంద కృష్ణ విమర్శించారు. మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప, పదవుల్లో తగిన వాటా ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు.

# కార్పొరేటర్ సదుర్ల శేఖర్ కు ఘన సన్మానం

**- నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి**
**- నాయీ మిత్ర మండలి జాతీయ కన్వీనర్ లయన్ అశ్విని చంద్రశేఖర్**




**భారతీయ వెలుగు:చీఫ్ బ్యూరో/వికారాబాద్, మార్చి:4,**
నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని నాయీ మిత్ర మండలి జాతీయ కన్వీనర్ లయన్ అశ్విని చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 36వ డివిజన్ కార్పొరేటర్ గా విజయం సాధించిన సదుర్ల శేఖర్ కు నాయీ మిత్ర మండలి ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా నాయీ మిత్ర మండలి జాతీయ కన్వీనర్ లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు విద్య, వైద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల చేయూత ను అందించాలన్నారు. ముఖ్యంగా నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ కు సత్వరమే పాలక కమిటీని నియమించి వృత్తి దారులకు ఆర్థిక సహకారం అందించాలన్నారు. అదేవిధంగా నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణుల కు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్పొరేటర్ సదుర్ల శేఖర్ మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా డివిజన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ మిత్ర మండలి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు ఈర్లపల్లి అశోక్ కుమార్, సమన్వయ కర్త యం.వి.రమణ, ఉద్యోగుల ఆర్థిక సంఘం అధ్యక్షులు సదుర్ల ప్రసాద్ విశ్రాంత యంఆర్ఓ ఎల్.గంగాధర్, విశ్రాంత ఏఈఓ,యం.కృష్ణయ్య, నాయీ యువత అధ్యక్షులు మణిపాల రాము, నాయకులు రాఘవేందర్, సుధాకర్, అశ్విని సతీశ్ కుమార్, పాతూరి రవి,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**- 13 వరకు జరుగనున్న బ్రహ్మోత్స వేడుకలు**
**- 6న స్వామివారి కళ్యాణోత్సవం**
**- 12న స్వామి వారి రథోత్సవం**
**- 13న జరిగే వేడుకలకు హాజరుకానున్న మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ**





**భారతీయ వెలుగు, హైదరాబాద్,మార్చి 04:**
శ్రీ ఉత్తరాధి మఠం ప్రాంగణంలోనున్న శ్రీ వరదేశ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయయి. ఉదయం స్వామివారికి అంకురార్పణం, పుణ్యవచణంతో ప్రత్యేక పూజలు నిర్వహించి, యాగం చేసి బ్రహ్మోత్సవాలను వేద పండితులు ప్రారంభించారు. సాయంత్రం స్వామివారికి కాచిగూడ, లింగంపల్లి పురవీధుల్లో విశ్వక్సేన ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. 6వ తేదీన శుక్రవారం శ్రీ స్వామివారి కళ్యాణం, 13వ తేదీన జరిగే అవభ్రిత సనానం, పుష్పయాగం కార్యక్రమానికి ఉత్తరాధిమంతం పీఠాధిపతి శ్రీ సత్యాత్మ తీర్థ స్వామిజీ శ్రీపాదులవారు హాజరవుతారని మఠం మేనేజర్ జయతీర్థాచార్ తెలిపారు. సంస్థాన పూజలు, 108 కళశాభిషేక పూజలు, పాదపూజ, ముద్రదారణ ఉంటుందన్నారు.

**13 వరకు బ్రహ్మోత్సవాలు**

కాచిగూడ, లింగంపల్లిలోని శ్రీ ఉత్తరాధి మఠంలో శ్రీ వరదేశ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మఠం మేనేజర్ జయతీర్థాచార్ తెలిపారు. బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 5వ తేదీన గురువారం ధ్వజారోహణం, శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు, ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు గాన సేవ, నృత్య సేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 6వ తేదీ శుక్రవారం స్వామివారి కళ్యాణోత్సవం, మోహిని అలంకారం, 7వ తేదీ శనివారం వసంతోత్సవం, సరస్వతి హోమం, సరస్వతి అలంకారం, 8వ తేది ఆదివారం శ్రీశుక్త హోమం, గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు, 9వ తేదీ సోమవారం హయగ్రీవ మంత్ర హోమం, అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు, 10వ తేది మంగళవారం నారాయణ మంత్ర హోమం, గరుడ వాహన సేవ, 11వ తేది బుధవారం పవమాన హోమం, హనుమద్ వాహన సేవ, వీనా ఏకాంతం, 12వ తేది గురువారం రథాంగ హోమం, రథోత్సవం, 13వ తేదీ గురువారం అవభ్రిత సనానం, పుష్పయాగం, ధ్వజా అవరోహణం తదితర కార్యక్రమాలు ఉంటాయి.

## ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

**- పదిమంది కూలీలకు గాయాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి హామీ కూలీలపై తేనె టీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వవరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం ఉదయం ఉపాధి పనుల్లో భాగంగా సర్వాయి కాలువ మరమ్మతు పనులను చేపట్టారు. దాదాపు 10 మంది కూలీలు అక్కడ పనిచేస్తుండగా చెట్టుపై ఉన్న తేనె టీగలు వారిపై దాడి చేశారు. తేనె టీగలు మీదకు రావడంతో భయపడిపోయిన కూలీలు అక్కడి నుంచి పరుగులు తీశారు. అప్పటికే వారిని తేనెటీగలు విపరీతంగా కుట్టాయి. ఇది గమనించిన తోటీ కూలీలు.. గాయపడిన వారిని కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. కానీ అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. పైగా ప్రభుత్వ అంబులెన్స్ కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇక చేసేదేమీ లేక.. గాయపడిన వారిని ట్రాలీ ఆటోలో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారి వెంట సర్పంచ్ సింగం శ్రీహరి, ఉపసర్పంచ్ లంబ రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్ వెళ్లారు. వారికి మెరుగైన వైద్యం అందిచేలా చూడాలని వైద్యులను కోరారు. కాగా, తేనేటీగల దాడిలో గాయపడిన వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వారిలో పులి పాలవ్వ అనే వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# చదువు ఉన్నత శిఖరాలు అధిరోహించే దారిని చూపుతుంది

» కేజీబీవీ విద్యార్థులకు ఆకస్మికంగా తనిఖీ చేసిన సూచన

» జిల్లా కలెక్టర్ దీపక్ తివారి







**భారతీయ వెలుగు:చీఫ్ బ్యూరో/వికారాబాద్, మార్చి:4,**
కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ దీపక్ తివారి బుధవారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. కిచెన్, వంట గది, బియ్యం, పప్పులు, గుడ్లు కూరగాయలు ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? అని ఆరా తీశారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని, హాజరు రిజిస్టర్ల ను వెరిఫై చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజు తింటున్న ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేడ్స్ ఏమి ఉన్నాయో ప్రశ్నించారు..? రోజూ ఎంత పరిమాణంలో తీసుకోవాలి, విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని ప్రశ్నించారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాదానాలు తెలుసుకున్నారు. ఈ సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు బాగా చదివి 100% ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి అన్ని పాఠాలు చదవాలి. రాయాలి అని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ స్వరూప, ఎంఇఓ, తదితరులు పాల్గొన్నారు.
అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి:-
బుధవారము వికారాబాద్ ఎన్నపల్లి ఒకటి, రెండు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, హాజరు నమోదు పుస్తకాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ పిల్లలతో ముచ్చటించి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సప్లిమెంటరీ పోషకాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, పిల్లల ఆరోగ్యం శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్ లైన్ ను పరిశీలించారు. ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే గ్రౌండ్ లో ఉన్న ప్రాథమిక పాటశాలను పరిశీలించి విద్యార్థులతో ఇంగ్లీష్ స్టోరి లను చదివించారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారిణి కృష్ణ వేణి, అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు సమర్థవంతంగా అమలు చేయాలి
పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూల్స్ , వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సుదీర్ లతో జిల్లా అధికారు సమగ్ర దిశా నిర్దేశం నిర్వహించారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ తాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయా లలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరి శు భ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీ లలో తడి--పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించ బడతాయని తెలిపారు.
ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం హోం, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్--సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత రక్షణ -- డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు.
మే 4 నుండి మే 9 వరకు రైతులు (వ్యవసాయం) అంశంపై వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు--విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 11నుండి మే16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించ బడతాయని తెలిపారు.
మే 18 నుండి మే 23 వరకు యువత క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు.
మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 6న ఉమ్మడి జిల్లా స్థాయిలో కార్యాచరణపై గౌరవ మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించ బడుతుందని వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశు భ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, తడి--పొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అన్నారు .
మహిళా సంఘాల రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, తక్కువ వసూళ్లు ఉన్న మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల స్థాపన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, శ్రీనిధి రుణాల 100 శాతం వసూళ్లపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతర పర్యవేక్షణలో ఉంచి వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ పూర్తి బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు.
ఇందిరమ్మ ఇళ్ల మంజూరు స్థితి, గ్రౌండ్ లెవెల్ పురోగతి, పెండింగ్ కారణాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త వాహనాలు, డ్రైనేజీ విస్తరణ వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం అత్యంత ముఖ్యమైన అంశమని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.
ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర వివరాలు సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ సుదీర్, రెవెన్యు అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్ఓ మంగి లాల్, ఆర్డిఓ వాసుచంద్ర, డిఆర్డిఏ శ్రీనివాస్. వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు: మంత్రి నారా లోకేశ్

» ప్రభుత్వ బడిలోని విద్యార్థిని సొంత బిడ్డలా భావించాలన్న నారా లోకేశ్

» జీవో 117తో గత పాలకులు విద్యావ్యవస్థను కుప్పకూల్చారని ఆగ్రహం

» యూనివర్సిటీల వీసీలుగా బంధువులు, అర్హత లేనివారేనని ఆరోపణలు

» టీచర్లను వైన్ షాపుల కాపలాకు వాడిన దుస్థితి గతానిది అంటూ విమర్శలు

» త్వరలో మెగా డీఎస్సీ తరహాలో అధ్యాపక పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటన

**భారతీయ వెలుగు విజయవాడ**
ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపేలా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచానికి చాటుదామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. శాసనసభలో విద్యాశాఖ బడ్జెట్ డిమాండ్ల ప్రతిపాదనల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో జరిగిన విధ్వంసం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను సవివరంగా వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, వాటి బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

**» గత పాలనలో విధ్వంసం - విద్యావ్యవస్థ కుదేలు**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని గణాంకాలతో సహా వివరించారు. డ్రాప్ బాక్సుల విధానాన్ని దుర్వినియోగం చేసి, సుమారు 3 లక్షల మంది పిల్లల పేర్లతో మధ్యాహ్న భోజనం, కిట్ల నిధులను డ్రా చేసుకున్నారని ఆరోపించారు.



కేవలం నంబర్లను మేనేజ్ చేయడానికే గత పాలకులు పరిమితమయ్యారని మండిపడ్డారు.

**» అధఃపాతాళానికి పడిపోయిన ప్రమాణాలు**

గత ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) దారుణంగా పడిపోయాయని మంత్రి తెలిపారు. 2018లో 5వ తరగతి పిల్లలు గ్రేడ్-2 తెలుగును 57 శాతం మంది అర్థం చేసుకోగలిగితే, గత ప్రభుత్వంలో అది 37 శాతానికి పడిపోయిందన్నారు. నేషనల్ ఎచీవ్ మెంట్ సర్వేలో 3వ తరగతి లాంగ్వేజ్ విభాగంలో ఏపీ 1వ ర్యాంకు నుంచి 27వ ర్యాంకుకు, మ్యాథ్స్ లో 5వ ర్యాంకు నుంచి 21వ ర్యాంకుకు పడిపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద కాపలాకు పెట్టి అవమానించారని, ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**» యూనివర్సిటీల్లో బంధుగణం - అక్రమ నియామకాలు**

విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చిందని మంత్రి ధ్వజమెత్తారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలను గాలికొదిలేసి, వీసీలుగా బంధువులను, అర్హత లేనివారిని నియమించి భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఏయూ వీసీగా ప్రసాదరెడ్డిని నియమించి విద్యార్థులను రోడ్లపై నిలబెట్టారని, అర్హత లేకపోయినా మాజీ సీఎం బంధువు సుందరవల్లిని ఎస్వీయూ రెక్టార్ గా, విక్రమ సింహపురి వర్సిటీ వీసీగా నియమించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి వంటి బంధువర్గానికి పదవులు కట్టబెట్టారని పేర్లతో సహా బయటపెట్టారు. వర్సిటీల్లో విగ్రహాలు పెట్టి, ఫ్లెక్సీలు కట్టి పవిత్రతను దెబ్బతీశారన్నారు. అంతేకాకుండా రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారని తెలిపారు.

**» సంస్కరణల బాటలో ప్రజాప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖలో ప్రక్షాళన మొదలైందని లోకేశ్ తెలిపారు. జీవో 117 రద్దు చేసి, సింగిల్ టీచర్ విధానానికి స్వస్తి పలికామన్నారు. కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల పోస్టుల భర్తీ చేపట్టామని గుర్తుచేశారు. మరోవైపు యూనివర్సిటీల్లోని న్యాయపరమైన చిక్కులను 90 రోజుల్లో తొలగించి, త్వరలోనే అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. స్కూల్ కిట్స్, చిక్కీ, గుడ్ల సరఫరాలో అవినీతిని అరికట్టి రూ.1,000 కోట్లు ఆదా చేస్తున్నామని, ఈ నిధులను విద్యార్థుల సంక్షేమమేకే వెచ్చిస్తామని స్పష్టం చేశారు.

**» ఎమ్మెల్యేలకు పిలుపు - టెక్నాలజీ వినియోగం**

ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలోని రెండు పాఠశాలలను దత్తత తీసుకోవాలని, ప్రతి వారం స్కూళ్లను సందర్శించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మంత్రి కోరారు. పిల్లల్లో 'పాసివ్ లెర్నింగ్' నుంచి 'యాక్టివ్ లెర్నింగ్' వైపు మార్పు తెచ్చేందుకు 'క్లిక్కర్ టెక్నాలజీ'ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం శోభా రియాలిటీ సంస్థ రూ.100 కోట్లు విరాళం అందించిందని సభకు తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు గారి సలహాలతో పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అందరం కలిసి ఏపీని విద్యాహబ్‌గా మారుద్దామని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# తెలంగాణ వర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉన్న వర్సిటీలోని సౌత్ క్యాంపస్ వసతీగృహంలో మంగళరవా అర్ధరాత్రి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. హోలీ సంబరాల అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ కొట్లాటలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వర్సిటీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన వారికి చికిత్స అందించారు. వసతీగృహం వద్దకు స్థానిక ఎస్సై ఆంజనేయులు, వార్డెన్ డాక్టర్ యాలాద్రి అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు

# ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే ఫీజు చెల్లింపు

ఉప్పల్ నియోజకవర్గపరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించారు. 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కులను బుధవారం నాడు లక్ష్మారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా చెక్కులు అందజేశారు.
ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డిని కేటీఆర్ అభినందించారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చెక్కులు అందజేయడం నిజంగా అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరకాల మా అడ్డా

**సురేఖ అక్కడి నుంచే పోటీ చేస్తారు: కొండా మురళి**

పరకాల మా అడ్డా అని, వచ్చే ఎన్నికల్లో కొండా సురేక అక్కడి నుంచే పోటీ చేస్తారని మాజ ఎమ్మెల్సీ, తెలంగాణ మంత్రి కొండా సురేఖ భర్త మురళీ కీలక వ్యాఖ్యలు చేశారు. పరకాల తమ అడ్డా... వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచే కొండా సురేఖ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బుధవారం గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరలో కొండా మురళీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తన బిడ్డ కొండా సుస్మిత ఎవరినైనా ఎదిరిస్తుందని చెప్పుకొచ్చారు. తనకన్నా కొండా సుస్మిత ధైర్యవంతురాలని తెలిపారు. కార్యకర్తలకు సమస్య వస్తే ఎవర్నీ వదలిపెట్టదని అన్నారు. ఎంతటివారినైనా ధైర్యంగా ఎదుర్కొంటుందని కొండా మురళీ పేర్కొన్నారు.

# నీ జీవితంలో నీ భార్యతో కలిసి తిరుమలకు రాలేవు..

» జగన్‌పై బీఆర్ నాయుడు ఫైర్

» హిందుత్వం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్న బీఆర్ నాయుడు

» అన్యమతస్తుల తొలగింపు నిర్ణయంతోనే తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపణ

» జగన్ భార్యతో కలిసి తిరుమలకు వస్తేనే జనం నమ్ముతారని స్పష్టీకరణ

**భారతీయ వెలుగు ప్రతినిధి తిరుమల**
వైసీపీ అధినేత జగన్ పై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆయన జగన్‌ను ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందుత్వం గురించి గానీ, శ్రీవారి గురించి గానీ మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది జగమెరిగిన సత్యం అంటూ ఈ మేరకు ట్వీట్ చేశారు.
"హిందుత్వం గురించి మాట్లాడే అర్హత నీకు లేదు. దేవదేవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గురించి నువ్వు మాట్లాడతావా జగన్..? ఆయన పేరు ఉచ్చరించే అర్హత, నైతికత నీకుందా? హిందూ వ్యతిరేకి అయిన నువ్వు సీఎంగా ఉన్నావనే కదా నీ అనుచరులకి ధైర్యం..! అందుకే వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి రెచ్చిపోయి హిందూ మత ఔన్నత్యాన్ని మంటగలిపారు. ఒక పథకం ప్రకారం తిరుమల కొండపై యథేచ్ఛగా అన్యమత ప్రచారం చేశారు.
అన్యమతస్తుడవైన నువ్వు ఇప్పటివరకు దేవదేవునిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదు? సీఎంగా ఉండగా నీ



భార్యతో కలిసి గుడికి వచ్చి పట్టు వస్త్రాలిచ్చావా?... రాలేదే! నీ జీవితంలో నీ భార్యతో కలిసి తిరుమలకు రాలేవు.. ఎందుకంటే మీ ఇద్దరూ నమ్మేది ఏసుప్రభువునే కానీ, శ్రీ వేంకటేశ్వర స్వామిని కాదు కాబట్టి... ఇది ఒప్పుకో జగన్!
నేను ఛైర్మన్ అయ్యాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు టీటీడీని ప్రక్షాళన చేస్తున్నాం. నీ అండతో నీ బాబాయ్, భూమన చేసిన అవినీతి, అక్రమాలు బయట పడుతున్నాయనే నీ బాధంతా! టీటీడీలో అన్యమతస్తులు ఉండరాదని నేను నిర్ణయం తీసుకున్న నాడే నాపై పథకం ప్రకారం కుట్రలు ప్రారంభించావు. అందులో భాగంగానే కదా నాపై డీప్ ఫేక్ వీడియోలు సృష్టించి తిరుమల ప్రతిష్ఠ దెబ్బతీయాలని చూశావు. శ్రీ వేంకటేశ్వర స్వామిని ఇంటిదైవంగా పూజించే చంద్రబాబుకు దేవదేవునిపై భక్తి లేదంటావా?చంద్రబాబు భార్యతో తిరుమలకు వస్తారు. నువ్వు హిందువువే అయితే భార్యతో తిరుమలకు రా...! అప్పుడు నిన్ను నమ్ముతారు. కానీ నువ్వు సతీసమేతంగా రాలేవు... నిన్ను ఎవ్వరూ నమ్మరు జగన్!" అంటూ బీఆర్ నాయుడు నిప్పులు చెరిగారు.

# మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

## రాహుల్‌కు మందకృష్ణమాదిగ లేఖ

రాజ్యసభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# టీఎన్జీవోల ఆధ్వర్యంలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు




**భారతీయ వెలుగు కరీంనగర్ మార్చి 4**
కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా టీఎన్జీవోల అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు అంబరాన్నంటాయి.
ఈ కార్యక్రమానికి రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులతో కలిసి రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపుతూ అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ , జిల్లా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి , జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు తదితరులు కలిసి మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ నివాసానికి వెళ్లి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ కూడా ఉద్యోగులతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొని రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. హోలీ పండుగ చిన్నా,పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలసి ఆనందంగా జరుపుకునే పండుగ అని నాయకులు పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, శీతాకాలానికి ముగింపు పలుకుతూ వసంత ఋతువుకు స్వాగతం పలికే పండుగగా హోలీని భావిస్తామని తెలిపారు.డప్పు చప్పుల మధ్య జరిగిన ఈ రంగుల హోలీ సంబరాలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, స్నేహభావాన్ని మరింత బలోపేతం చేశాయి.ఈ కార్యక్రమంలో టిఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ,కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి ,రాగి శ్రీనివాస్ ,సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ సంఘం అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షులు కోడూరి వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్, నాయకులు కోట రామస్వామి, శంకర్ ,రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, ఎవి .రాజేశ్వరరావు ,నగేష్ గౌడ్, బైరి శ్రీనివాస్ ,కోటేశ్వర అల్లే, పాల్గొన్నారు

# ప్రేమ, ఐక్యతకు ప్రతీక హోలీ

» జడ్జిలు ప్రవీణ్ కుమార్, జ్యోతిర్మయి
» వేములవాడ కోర్టులో ఘనంగా హోలీ వేడుకలు



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
ప్రేమ ఐక్యతకు ప్రతీక రంగుల పండుగ హోలీ అని సిరిసిల్ల, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్ కుమార్ జ్యోతిర్మయి అన్నారు. బుధవారం హోలీ పండుగను పురస్కరించుకొని కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగుల కేళీలో జడ్జీలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ సామాజిక ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే హోలీ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం న్యాయవాదులకు హోలీ శుభాకాంక్షలు తెలిపి, హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణం రంగుల మయంగా మారి పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో ఎజిపి బొడ్డు ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమల గౌడ్, పురుషోత్తం,పర్లపెల్లి అంజయ్య, గుండ రవి, కిషోర్ రావు, నక్క దివాకర్,అనిల్ కుమార్, జనార్ధన్, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, సుజాత, అన్నపూర్ణ, పడగెల మమత ,బూర సరిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా గుడిపాటి పుల్లారెడ్డి - లక్ష్మి దంపతుల స్వర్ణోత్సవ వేడుకలు



**భారతీయ వెలుగు ప్రతినిధి హుజూరాబాద్ , మార్చి 04:**
స్థానిక పట్టణంలోని 30వ వార్డు విద్యానగర్ నివాసి, సింగరేణి విశ్రాంత ఉద్యోగి గుడిపాటి పుల్లారెడ్డి - లక్ష్మి దంపతుల వివాహ స్వర్ణోత్సవ వేడుకలు (50 ఏళ్ల పండుగ) బుధవారం స్థానిక ఆర్.ఆర్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగాయి.

**--కుటుంబ నేపథ్యం, ప్రస్థానం....**

కరీంనగర్ జిల్లా ఓదెల మండలం మడక గ్రామంలో కౌసల్య, వెంకట్ రెడ్డి దంపతులకు జన్మించిన పుల్లారెడ్డి, సామాన్య మధ్య తరగతి కుటుంబం నుండి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1982లో సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి, సుదీర్ఘంగా 35 ఏళ్ల పాటు సేవలందించి 2016 నవంబర్‌లో పదవీ విరమణ పొందారు. 1976 మార్చి 3న లక్ష్మితో వీరి వివాహం జరిగింది. వీరి ఇద్దరు కుమారులు వేణుగోపాల్ రెడ్డి (భార్య వినీత), శ్రీధర్ రెడ్డి (భార్య రాణి) ప్రస్తుతం అమెరికాలో స్థిరపడగా, మనమలు బ్రిషిన్ రెడ్డి, విహాన్ రెడ్డి, మనమరాలు లేహనలతో కలిసి ఈ వేడుకలు జరుపుకోవడం విశేషం.

**-- హాజరైన ప్రముఖులు...**

ఈ ఆదర్శ దంపతుల 50వ వివాహ వార్షికోత్సవానికి హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు దంపతులు, 25వ వార్డు కౌన్సిలర్ మంచికట్ల ప్రశాంతి - మురళి దంపతులు హాజరై, పుల్లారెడ్డి దంపతులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. -ఈ కార్యక్రమంలో విద్యానగర్ కాలనీవాసులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుల్లారెడ్డి-లక్ష్మి దంపతులు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# నిరుపేద వృద్ధ మహిళలకు అండగా భరోసా..



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని మార్చి 04:**
రామగుండం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సామాజిక కార్యకర్త పల్లికొండ రాజేష్ ఆధ్వర్యంలో ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ భరోసా ఫౌండేషన్ ద్వారా దాతలు మొలుగూరి వాణి శ్రీనివాస్ యూఎస్ఏ వారి సహకారంతో భరోసా ఆర్గనైజర్ నసీమా, యువ నాయకులు పల్లికొండ నరేష్ తోపాటు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వీల్ చైర్ అందజేశారు. పల్లికొండ రాజేష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన వృద్ధ మహిళ గత గున్నాల రామమ్మ నడవడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకొని భరోసా స్వచ్ఛంద సంస్థ వారికి ఇట్టి తెలియజేయడంతో వారు వెంటనే స్పందించి ఉపాధి నిమిత్తం విదేశాలలో (యూఎస్ఏ) నివాసముంటున్న మొలుగూరి వాణి శ్రీనివాస్ మాతృదేశం మీద మమకారంతో ఎంతోకాలంగా నిస్సహాయులకు నిస్వార్థ సేవలు అందిస్తున్నారని వారి సహకారంతో భరోసా సంస్థ ద్వారా వీల్ చైర్ అందజేయడం చాలా ఆనందంగా ఉందని, మొలుగురి వాణి శ్రీనివాస్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని వృద్ధ మహిళ రామమ్మ కుటుంబ సభ్యుల తరఫున భరోసా స్వచ్ఛంద సంస్థ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భరోసా సంస్థ నిర్వాహకురాలు నసీమతో పాటు యువ నాయకులు పల్లికొండ నరేష్ జెసి, సంతోష్, నరేందర్, రవి, అనిల్,నిహాల్, మనోజ్, చరణ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట పట్టణంలో పచ్చదనం పరిరక్షణకు మరో ముందడుగు పడింది.




**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మార్చి 4**
జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పర్యావరణ పరిరక్షణ దిశగా తన సంకల్పాన్ని కార్యరూపంలో చూపించారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రేరణతో ప్రారంభమైన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గర్రెపల్లి సతీష్ ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పార్క్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) గారు, “నేను గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో గతంలోనే పాల్గొని అనేక మొక్కలు నాటాను. ప్రస్తుత కాలుష్య ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అత్యవసరం. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి” అని పేర్కొన్నారు. అంతేకాకుండా, రానున్న ఐదేళ్ల కాలంలో విడతల వారీగా విస్తృత స్థాయిలో మొక్కలు నాటించి, వాటిని సంరక్షిస్తూ జమ్మికుంట పట్టణాన్ని పచ్చని వనంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేకంగా హరిత కార్యక్రమాలు చేపట్టి, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీలు, ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.
పచ్చదనం పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం మన అందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో చెప్యాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు. పట్టణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు





**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని మార్చి 04:**
రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరి ఖని చౌరస్తాలో బుధవారం నిర్వహించిన హోలీ సంబరాలు అంబరాన్నశీటాయి. ఈ సందర్భశీగా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నా పెద్దా తేడా లేకుండా కొత్తగా ఎన్నికైన పాలకవర్గం ప్రజలతో మమేకమై పని చేస్తుందని అన్నారు. రామగుండం నగరం 2029 నాటికి సకల సౌకర్యాలతో సంపూర్ణశీగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పని చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే రూ.800 కోట్లతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలందరూ సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సంబరాలలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్న ధాతలను ఆదుకోవడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం..

**- ఏప్రిల్ 28న కరీంనగర్ లో రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన**
**- రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు...**




**భారతీయ వెలుగు హుజురాబాద్:**
పాలకులు రైతు ప్రభుత్వాలు అని గొప్పలు చెప్పుకోవడం తప్ప వారిని ఆదుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆరోపించారు. రాష్ట్రం లోని రైతులు ముఖ్యంగా కౌలు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల ఉద్ధరణ కోసం అనేక కమిటీలు చేసిన సిఫారసులను వెంటనే ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. బుధవారం రైతుల గిట్టు బాటు ధర పై ఎదుర్కొంటున్న సమస్యలు. . ఉపాధి హామీ పథకం పనుల వర్కర్లు పామాయిల్ తోటల సాగు గురించి కరీంనగర్ జిల్లా మానకొండూర్, శంకర పట్నం, హుజురాబాద్ మండలం, ఎల్కతుర్తి మండలాల్లో పోలాడి రామారావు క్షేత్ర స్థాయిలో పర్యటించి హన్మకొండ జిల్లా సరిహద్దు ప్రాంతంమైన పెంచికల పేట శివారు ప్రాంతం రైతు మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి పెంచుతున్న పామాయిల్ తోటల పెంపకం పనితీరును పరిశీలించారు. అనంతరం గూడూరి స్వామి రెడ్డి తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల పంటల పై ప్రస్తుతం అమలు జరుగుతున్న గిట్టు బాటు ధరలు అన్న దాతలకు ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేనే లేవని రైతులు పండించిన పంటలకు రైతులే గిట్టు బాటు ధరలను నిర్ణయించుకునే అవకాశం కల్పించే విధంగా జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత పెరుగుతోందని, ఖర్చులు బాగా పెరిగి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతుల వ్యవసాయరంగానికి చేయూత నిచేందుకు, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడం తో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపితం చెయ్యాలంటే జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగాన్ని తక్షణమే అనుసంధానం చేయాలన్నారు. రైతు భీమా వయోపరిమితిని 70ఏళ్లకు పెంచాలని, 50ఏళ్లు నిండిన రైతులకు నెలకు కనీసం 6వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రైతుల అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు 10లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. ఏప్రిల్ 28న ఓసి ఐకాస, రైతు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ లో లక్ష మంది తో రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన.. సమరభేరి సభను నిర్వహించనున్నట్లు రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. పార్టీల కతీతంగా అందరినీ సభకు ఆహ్వానిస్తామని అన్ని జిల్లాలనుంచి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు భారే సంఖ్యలో తరలి వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహ రెడ్డి, నాయకులు బోయినపల్లి దేవేందర్ రావు, గూడూరి శంకర్ రెడ్డి, గూటం జోగిరెడ్డి, మేకల చంద్రయ్య, చైతన్య రెడ్డి తదితరులు రైతులు ఉపాధి హామీ వర్కర్లు పాల్గొన్నారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
గురువారం మార్చి 05, 2026

## ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు: ధనపురి సాగర్




**భారతీయ వెలుగు కరీంనగర్ మార్చి 4**
హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ 16 వ డివిజన్ మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 19 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేయడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలను పండుగలాగా భావించాలని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని, ఇతర విద్యార్థులతో పోల్చుకోకుండా, ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అలాగే ప్రశ్నపత్రంను మూడు నాలుగు సార్లు చదివి అర్థం చేసుకొని సమాధానం రాయడానికి పూనుకోవాలని సూచించారు. రాబోవు వార్షిక పరీక్షలో ఏ విద్యార్థి అయితే 555 పై మార్కులు సాధిస్తారు వారికి సంస్థ పక్షాన 2016 నగదు పారితోషికం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భీమేష్ సంస్థ సభ్యులు శ్రీధర్ రెడ్డి, కె.మన్ సాయి, హిమ సాయి, టి . శ్రీరామ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏ.ఎన్. సి పాటశాలలో ఘనంగా హోలీ సంబరాలు




**భారతీయ వెలుగు కరీంనగర్ మార్చి 4**
ఎ. ఎన్.సి. పాటశాలలో బుధవారం హోలీ సంబరాలను పురస్కరించుకొని పాటశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రామ్ రెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోషరెడ్డి ముందుగా కృష్ణుడి విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేసి చిన్నారులతో హోలీ సంబరాల్లో పాలుగొన్నారు.సంతోష్ రెడ్డి, హరికృష్ణ మాట్లాడుతు విద్యార్థులకు రంగుల ప్రత్యేకతని తెలిపి వారి జీవితంలో హోలీ సంతోషాల హరివిల్లు నింపాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్తులకి మిటాయిలని పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృంధశీ చిన్నారులు తల్లితండ్రులు పాల్గోని పాటశాల ప్రాంగణంను రంగులమయం చేసారు.విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలతో హోలీ సంబరాలని ఘనంగా జరుపుకున్నారు.

## మల్లేశ్వర స్వామి దేవస్థానం సందర్శించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ దిలీప్



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మార్చి 4**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని వీణవంక రోడ్డులో ప్రసిద్ధి చెందిన మాడేలేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న చైర్మన్ కి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి వేదమంత్రాల నడుమ ఆలయ ప్రాంగణంలోకి ఆహ్వానించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పట్టణ ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థనలు చేశారు.
ఈ సందర్భంగా స్థానిక రజక సంఘం నాయకులు చైర్మన్ ని దిడ్డి రామును ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, స్మారక చిహ్నాలు అందజేసి తమ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ చూపుతున్న చొరవను కొనియాడుతూ, వీణవంక రోడ్డులో మౌలిక వసతుల మెరుగుదల, పారిశుధ్య నిర్వహణ, రహదారి అభివృద్ధి వంటి పనుల్లో ఆయన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.
రజక సంఘం అధ్యక్షులు వరగంటి సదానందం మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బూరుగుపల్లి రాము, దెబ్బట రవీందర్, శ్రీనివాస్, సారయ్య, సమ్మయ్య, పసునూటి శ్రీకాంత్, నాగరాజ్, రాజేందర్ తదితరులు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
దేవాలయ దర్శనానికి హాజరైన భక్తులు, స్థానికులు చైర్మన్ ని అభినందిస్తూ ఆయన సేవాభావాన్ని కొనియాడారు. ఆలయ ప్రాంగణం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమం అనంతరం ప్రసాద వితరణ నిర్వహించి, అందరికీ స్వామివారి ఆశీస్సులు అందించారు.
మొత్తంగా ఈ కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను ప్రతిబింబిస్తూ ఘనంగా సాగింది. పట్టణ ప్రజల సమక్షంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం మున్సిపల్ పరిధిలో విశేషంగా చర్చనీయాంశమైంది.

# జమ్మికుంట అయ్యప్ప స్వామి దేవాలయం 27వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు,

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మార్చి 4**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో వెలసిన జమ్మికుంట అయ్యప్పా స్వామి దేవాలయం లో 27వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించబడ్డాయి. తెల్లవారుజామున నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి, "స్వామియే శరణం అయ్యప్ప" నినాదాలతో మార్మోగింది. ప్రత్యేకంగా పూలతో, విద్యుద్దీపాలతో అలంకరించిన స్వామివారి సన్నిధి భక్తులను ఆహ్లాదపరిచింది.
వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అష్టాదశ కలశ పూజలు, నవవిధ అభిషేకాలు, మహామంగళహారతి, పూర్ణాహుతి వంటి విశిష్ట క్రతువులు ఘనంగా నిర్వహించారు. లక్ష పుష్పార్చనలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారికి పుష్పాలు సమర్పించి తమ భక్తిని వ్యక్తపరిచారు. ఆలయ ప్రాంగణం మొత్తం ధూపదీప నైవేద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
ఈ మహోత్సవానికి కాల్వ శ్రీరాంపూర్ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే కాల్వ శ్రీరాంపూర్ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులు విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన



సిరిమల్ల జయేందర్ గురుస్వామిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పట్టు వస్త్రాలు, శాలువాతో ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. గురుస్వామి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి భక్తి మార్గం నియమ నిష్ఠలు, ఐక్యత, సేవా భావం పెంపొందిస్తుందని, యువత సన్మార్గంలో నడవాలని సూచించారు.
వార్షికోత్సవం సందర్భంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు. తాగునీటి సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్లు, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టారు. మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించి సేవా భావాన్ని చాటుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఏ. ప్రసాద్, జగదీశ్వర్, మనోహర్, ఇమ్మడి భాస్కర్, బచ్చు వీరలింగం, దామోదర్,





నారాయణ, వీరరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.
మొత్తానికి 27వ వార్షికోత్సవ వేడుకలు జమ్మికుంట పట్టణంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపగా, భక్తుల విశ్వాసం, ఐక్యత, సేవా తత్పరతను ప్రతిబింబించాయి. స్వామివారి కృపతో పట్టణ ప్రజలందరికీ శాంతి, సౌఖ్యం, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

# గట్టు మల్లికార్జున స్వామి గంగ స్నానం -- గంగపట్నం ఖర్చులన్నీ వచ్చే ఐదు సంవత్సరాలు నేనే భరిస్తా"

**- మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్**

**భారతీయ వెలుగు ప్రతినిధి ఇల్లందకుంట మర్చి 4**
ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి--మల్లన్నపల్లి గ్రామంలో స్వయంభుగా వెలిసిన శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తి, శ్రద్ధ, వైభవాలతో కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో అత్యంత పవిత్రమైన గంగ స్నానం -- గంగపట్నం కార్యక్రమానికి సంబంధించిన వచ్చే ఐదు సంవత్సరాల ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ ఘనంగా ప్రకటించారు.
బ్రహ్మోత్సవాల భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పవిత్ర క్షేత్రమైన కాళేశ్వరం దేవాలయం కు తీసుకెళ్లి గంగ స్నానం చేయించడం అనాదిగా వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం. ఈ పవిత్ర స్నానం ద్వారా గ్రామానికి శాంతి, సౌఖ్యం, ఐశ్వర్యం, సస్యశ్యామలం కలుగుతాయని భక్తుల విశ్వాసం. స్వామివారి కృపతో గ్రామ ప్రజల జీవితాల్లో ఆనందం, అభివృద్ధి చేకూరాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.
ఈ సందర్భంగా సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ మాట్లాడుతూ,
"స్వామివారి ఆశీస్సులతో ఈ సేవ చేయగలగడం నా పుణ్యం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



రవాణా, భోజన సదుపాయాలు, తాగునీరు, వైద్య సాయం, విశ్రాంతి ఏర్పాట్లు వంటి అన్ని ఖర్చులను వచ్చే ఐదు సంవత్సరాల పాటు భరిస్తాను. గంగ స్నానం మహోత్సవం మరింత వైభవంగా జరగడానికి నా వంతు కృషి చేస్తాను" అని తెలిపారు.
భక్తుల రవాణా కోసం ప్రత్యేక బస్సుల ఏర్పాటు, అన్నదాన కార్యక్రమం, తాగునీటి ట్యాంకర్లు, భక్తుల కోసం విశ్రాంతి షెడ్లు, మహిళలు--వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడం గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. ఈ దాతృత్వ నిర్ణయం పట్ల గ్రామ పెద్దలు, యువకులు, మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేశారు.
అదేవిధంగా దేవస్థానం అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ఆలయ ప్రాంగణం శుభ్రత, విద్యుత్ దీపాలంకరణ, సీసీ రోడ్లు వంటి పనులకూ తన వంతు సహకారం అందిస్తానని సర్పంచ్ స్పష్టం చేశారు. గ్రామ ప్రజల సమగ్ర సహకారంతో ఆలయాన్ని



మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని తెలిపారు.
మార్చి 15న జరిగే మహా జాతరను భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాచపల్లి--మల్లన్నపల్లి గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.
భక్తి భావం, దాతృత్వం, గ్రామాభివృద్ధి పట్ల అంకితభావంతో తీసుకున్న ఈ నిర్ణయం ప్రాంతంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది. శ్రీ గట్టు మల్లికార్జున స్వామివారి కృపతో జాతర విజయవంతం కావాలని గ్రామ ప్రజలంతా ప్రార్థిస్తున్నారు.

# మెదక్ పట్టణంలో గాంధీ విగ్రహా మొహంపై పశువుల పేడ నెత్తి పైన పాదరక్షలు పెట్టిన గుర్తు తెలియని దుండగులను అరెస్ట్ చేయాలని అఖిలపక్ష నాయకుల డిమాండ్

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి మార్చి 4**
మెదక్ జిల్లాపట్టణం కేంద్రంలోని రాందాస్ చౌరస్తా లో ఉన్న గాంధీ విగ్రహనికి పశువుల పెడ కోట్టి ...తల పై చెప్పులు పెట్టిన గుర్తు తెలియ దుండగులు వెంటనే అరెస్టు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు..ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు నల్ల కండువాలు వెసుకుని రాందాస్ చౌరస్తాలో ధర్నా రాస్తా రోకో నిర్వహించారు.. ఈ సందర్భంగా అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.. దేశ జాతిపిత మహాత్మా గాంధీని అవమానపరిచిన గుర్తు తెలియని దుండగులను వెంటనే అరెస్టు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ డిమాండ్ చేశారు.అనంతరం అఖిల పక్ష నాయకులు గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసిన అనంతరంవారు మాట్లాడుతూ నేడు భారత దేశంలో ఉన్న ప్రతి ఒక్క పౌరుడు స్వతంత్రంగా



బ్రతుకుతున్నారు అంటే అలనాటి భారత దేశ బావి తరాలకు తాను అందరం శాంతియుతంగా ఉండాలని శాంతిపరంగా స్వాతంత్రాన్ని సంపాదించిన మహాత్మ గాంధీ ని అవమానపరి చే విధంగానే దేశ పరిపాలన సాగుతుందని భారతదేశానికి స్వాతంత్రం రావాలి అని శాంతియుతంగా స్వాతంత్రాన్ని తీసుకువచ్చిన మహాత్ముడు గాంధీ నీ అవమానించిన అగాంతకులను కఠినంగా శిక్షించాలని అఖిల పక్షా నాయకులు మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు..సంఘటన స్థలానికి మెదక్ పట్టణ సీఐ మహేష్ చేరుకుని పరిశీలించి రాశీదాస్ చౌరస్తాలో ఉన్న సి సి కెమెరలను పరిశీలిస్తున్నారు. గాంధీ విగ్రహం పై పశువుల పేడ చెప్పులు పెట్టినటువంటి వారిపై త్వరలోనే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలియజేశారు

## రామాయి పల్లి గ్రామంలో ఘనంగామల్లన్నఎల్లమ్మ దేవతమృతులకు ఘనంగా బండ్లుబోనాల ఊరేగింపు నిర్వహించిన యాదవ సంఘం సభ్యులు

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి మార్చి 4**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం రామయ్య పల్లి యాదవ సంఘం సభ్యులు ప్రతి సంవత్సరం ఎల్లమ్మ మల్లన్న జాతర మహోత్సవాలను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా నిర్వహించడం జరిగిందని రామయ్యపల్లి యాదవ సంఘ సభ్యులు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి వారి తాత ముత్తాతల కాలం నాటి నుండి రామయ్యపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం మల్లన్న ఎల్లమ్మ సకల దేవతలకు యాదవ కులస్తులు అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఉద్దేశంతోనే ప్రతి సంవత్సరం జాతర మహోత్సవాలలో భాగంగా మొదటి రోజు గంగ స్నానం , రెండవ రోజు మల్లన్న



కళ్యాణం బోనాలు, మూడవరోజు ఒగ్గు కథ బండ్లు , నాలుగవ రోజు రేణుక మాత ఎల్లమ్మ తల్లికి బోనాలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఎల్లమ్మ మల్లన్న దేవతలకు అలనాటి నుంచి వస్తున్న సాంప్రదాయాన్ని పాటిస్తూ ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా యాదవ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించుకుంటున్న జాతరకు మల్లన్న ఎల్లమ్మ దీవెనలు ఉండడం వలన ప్రతి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. యాదవ సంఘఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం అమ్మవారికి బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి మట్టి కుండలో నైవేద్యం తీసుకొని, డప్పు సప్పుల మధ్య శివసత్తుల విన్యాసాలతో పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నా మహిళ యాదవ కులాస్తులు ఈ కార్యక్రమంలో రామయ్య పల్లి గ్రామస్తులు యువకులు పెద్దలు పాల్గొన్నారు

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
గురువారం మార్చి 05, 2026

# గ్రామల అభివృద్దే లక్ష్యంగా నూతన సీసీ రోడ్ల రోడ్డును ప్రారంభించిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి మార్చి 4**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని బుధవారం నాడుకొంతాన్‌పల్లి గ్రామంలో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సహకారంతో,ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. కొంతన్పల్లిగ్రామ సర్పంచ్ చింతల విజయ వెంకట్రాంరెడ్డి కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి స్థానిక సర్పంచ్ విజయ వెంకటరామ్ రెడ్డిలు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను తన సమస్యగా స్వీకరించి, గ్రామాన్ని సమస్యల రహితంగా అభివృద్ధి చేయడం తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తన సొంత నిధులను కూడా ఖర్చు చేయటానికి వెనుకాడమని సర్పంచ్ విజయ వెంకట్రాంరెడ్డి తెలిపారు అనంతరం నర్సాపూర్



నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గ గ్రామాల అభివృద్ధి కోసం తాను సాయ శక్తులుగా అభివృద్ధి కోసమే ఎల్లవేళలా వర్గ ప్రజల సమస్యలను తీర్చడానికి తాను ముందస్తులని ఉంటానని నియోజకవర్గంలోని ఎవరికి ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే తమ గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను తీర్చడమే కాకుండా వారికి తోడు నీడగా ఉంటూ నర్సాపూర్ నియోజకవర్గా గ్రామాల అభివృద్ధి చేయడమే తన కర్తవంగా భావిస్తున్నానని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎటువంటి విభేదాలు పెట్టుకోవద్దని పార్టీ కోసమే పార్టీ పరువు ప్రతిష్టను మునుమందు చేయబోయే కాంగ్రెస్ పరిపాలన అభివృద్ధి చేయబోయే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పరిపాలన ఎలా సాగింది అనేది అందరికీ తెలుసునని నేడు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ పరిపాలన కొనసాగుతుందని అలాంటి పరిపాల నా మునుముందుగా ఎంతో అభివృద్ధి పనులను చేపట్టాలని ఆకాంక్షిస్తూ నేడు గ్రామాలలో సిసి రోడ్లు లేని రహదారులను సిసి రోడ్లుగా తీర్చిదిద్దరమే తమ పనే కాకుండా ఇతర గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను కూడా తాము తీర్చగలము పరిపాలనలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను గ్రామపంచాయతీ ల వారీగా నిధులను అమలు చేయడం జరుగుతుంది గ్రామంలో ఉన్నటువంటి పాఠశాలలకు ప్రవారి గోడలను నిర్మించడానికి నిధులు మంజూరు చేసిందని స్థానిక సర్పంచులు ముందుకు వచ్చి తమ గ్రామంలో ఉన్నటువంటి పాఠశాలకు ప్రవారీ గోడలను నిర్మించాలని అందరం కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్తలు కాకుండా నాయకులు కూడా అందరం కలిసి మెలిసి ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్లి ప్రజలకు తెలియజేయాలని బిఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను చూసి పూర్వలేక తమ పార్టీపై లేని పోనీ ఆరోపణలు చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారే తప్ప గత పరిపాలనలో చేసినటువంటి అభివృద్ధి పనులు ఏమీ లేవని 10 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాము అని ఉద్దేశమే కాకుండా తాము సంపాదించుకున్న అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి కోసమే పరిపాలన కొనసాగించాలని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలన కొనసాగించేంతవరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరిపాలన ఉన్న కాంగ్రెస్ పార్టీపై ఎన్ని ఆరోపణలు చేసినా ఎవరు పట్టించుకోని నాధుడే లేదని ఇకనైనా వారు చేసిన తప్పిదాలను సరిచూసుకొని పరిపాలన సజావుగా సాధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎలాంటి ఆరోపణలు చేయడం మానుకోవాలని వారు తెలియజేశారుఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బొల్లారం కుమార్ ముదిరాజ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రాధిక వార్డు సభ్యులు ఉప్పరి సంతోష్ ముదిరాజ్, గుండు అంజమ్మ వెంకటేష్, గుండు వేణుగోపాల్, సారా శంకర్ లాల్, గొల్ల నాగరాణి యాదగిరి, గొల్ల కవిత రమేష్, చింతల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ప్రజలు నాయకులు సివిఆర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఎర్రబెల్లి సంపత్ రావు -- స్వప్న దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షల వెల్లువ

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మార్చి 4**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన ఎర్రబెల్లి సంపత్ రావు పెళ్లి రోజు సందర్భంగా పెళ్లిరోజు అనేది కేవలం ఒక తేదీ మాత్రమే కాదు... రెండు మనసులు కలిసిన పవిత్ర బంధానికి గుర్తుగా నిలిచే ఓ మధురమైన జ్ఞాపకం. ఈ శుభసందర్భంగా ఎర్రబెల్లి సంపత్ రావు -- స్వప్న దాంపత్య జీవితం ప్రేమ, విశ్వాసం, పరస్పర గౌరవం, సంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండిపోవాలని మనసారా కోరుకుంటున్నాము. మీరు ఇలాంటి పెళ్లిరోజులు మరెన్నో శతాబ్దాల పాటు ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని ఆశిస్తున్నాము.

విద్యార్థి దశలోనే సామాజిక చైతన్యంతో ముందుకు వచ్చిన సంపత్ రావు అఖిల భారతీయ విద్యార్థి పరిషద్ (ఏబీవీపీ) ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి మండల అధ్యక్షులుగా, జిల్లా కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తూ, జాతీయ భావజాలంతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. వారి కృషి, పట్టుదల, నిబద్ధత కారణంగా ప్రజల్లో విశేష ఆదరణ పొందారు.

ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ అభివృద్ధి, సామాజిక సేవా





కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

ఈ శుభ సందర్భంగా బిజెపి పట్టణ మాజీ అధ్యక్షుడు జీడి మల్లేష్ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు పట్టణంలోని (బొమ్మల గుడి) శివాలయంలో అన్నదాన వితరణ చేయడం జరిగింది. సంపత్ రావు దంపతులకు పలువురు రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అయ్యప్ప ఆలయ ప్రతినిధులు, గురుస్వాములు శాలువాలతో ఘనంగా సత్కరించి సంపత్ రావు దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వారి నివాసంలో ఆనంద వాతావరణం నెలకొని, స్నేహితులు, బంధువులు, అభిమానులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

సంపత్ రావు సామాజిక సేవా దృక్పథానికి స్వప్న ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయం. ఒకరి విజయానికి మరొకరు బలంగా నిలుస్తూ ఆదర్శ దంపతులుగా నిలుస్తున్నారు.

మీరు ఇద్దరూ కలిసి సమాజానికి మరింత సేవ చేయాలని, కుటుంబ జీవితంలో సంతోషాలు వెల్లివిరియాలని, మీ జీవితం ఆనందాలతో కళకళలాడాలని కోరుకుంటూ...

మరొక్కసారి ఎర్రబెల్లి సంపత్ రావు -- స్వప్న దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు!

ఇలాంటి శుభదినాలు మరెన్నో సుఖశాంతులతో జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాము.అన్నధాన వితరణ కార్యక్రమంలో జీడి మల్లేష్, ఇటుకల సరూప, మోతే స్వామి, బచ్చు శివకుమార్, పల్లపు రవి, కొండ్లె నాగేష్, బొంతల అమరేందర్, ఉడుగుల మహేందర్ ముకుంద సుధాకర్, అప్పల రవీందర్, కొండపర్తి ప్రవీణ్, యంసాని సమ్మయ్య, ఇల్లందుల శ్రీనివాస్, తదితరు పాల్గొన్నారు

# యంగ్ ఇండియా స్కూల్స్ టెండర్లలో అవినీతి త్వరలోనే వివరాలు బయటపెడతాం

**- జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు**
**- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**

యంగ్ ఇండియా స్కూల్స్‌లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ప్రభుత్వ పనితీరుపై హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. యంగ్ ఇండియా స్కూల్స్‌లో ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారో అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదని.. మేము ప్రతిపక్షంగా సక్సెస్ అయ్యామని పేర్కొన్నారు. ఖమ్మంకు కేటీఆర్ వెళ్లారు.. ఇప్పుడు స్థలాలు ఇస్తాం.. ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్లాను.. అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్లాం. వెంటనే ముఖ్యమంత్రి కూడా వెళ్లారు. హెల్త్ సిటీకి వెళ్లాం ప్రతి దానికి మేము వెళ్లాక స్పందిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారని.. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్‌లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్డ్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్‌లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్‌లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోందని.. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారని హరీష్ రావు ఆరోపించారు. అక్కడ రెడీమిక్స్‌కు పర్మిషన్ లేదన్నారు.

# జర్నలిస్టుల చలో విజయవాడ

## - సమస్యలపై భారీగా ర్యాలీ

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఎపిబిజెఎ) సంయుక్త ఆధ్వర్యాన 'జర్నలిస్టుల చలో విజయవాడ' కార్యక్రమంలో భాగంగా బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులంతా ర్యాలీగా ప్రారంభమై విజయవాడలోని రాఘవయ్య పార్కు నుండి బందరులాకులు, పాతబస్టాండ్ మీదుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు సాగారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని, ఆరోగ్య బీమా పథకానికి తోడుగా ప్రతి ఆరు నెలల కొకసారి జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షల సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలపై అధ్యయనానికి మీడియా కమిషన్, వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు హైపవర్ కమిటీలను, మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలని, రైల్వే ప్రయాణంలో రాయితీని కొనసాగించాలని కోరారు. ర్యాలీ అనంతరం కళాక్షేత్రంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సభలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు.

# ఆస్తులను కూడా వదిలేట్టుగా లేరు తన పొలం సర్వేకు నోటీసులపై మండిపడ్డ అంబటి

కూటమి ప్రభుత్వం తనపై, తన కుటుంబంపై చేసిన పాశవికమైన దాడి అందరూ చూశారని మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అంబటి రాంబాబు పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వారు మినహా.. రాష్ట్ర ప్రజలు దీనిని దారుణమైన సంఘటనగా పరిగణించారని చెప్పుకొచ్చారు. తన ఆస్తులపై కూడా దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తనకు సత్తెనపల్లిలో 22 ఎకరాల పొలం ఉందని.. ఆ పొలానికి కూడా సర్వే పేరుతో నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు. బుధవారం గుంటూరులో మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడారు. తన పొలాన్ని సర్వే చేయాలని ఎమ్మార్వో కార్యాలయం నుంచి తనకు నోటీసులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ తనిఖీ చేయమని చెప్పారని వారు తనకు చెప్పారన్నారు. తన పొలంలో స్విమ్మింగ్ పూల్, గెస్ట్ హౌస్ ఉందని.. సర్వే చేయాలని అధికారులు చెబుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు పని ఏమి లేదా అని ప్రశ్నించారు. వారు తన ఆస్తుల మీద పడ్డారని... తాను లీగల్‌గా కొనుకున్న స్థలం అదని చెప్పుకొచ్చారు. తాను వేరే వారి నుంచి పొలం కొనుక్కునే ముందే అందులో చిన్న బావి, పెంకుటిల్లు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి అధికారం శాశ్వతం కాదన్నారు. తన దగ్గర దాపరికాలు ఏమి ఉండవుని.. చంద్రబాబు, లోకేశ్ తన పొలం చూస్తాను అంటే రావాలని అన్నారు. తనను బయపెట్టాలని వారు అనుకుంటున్నారని.. రేపు గుంటూరులో తమ ఇంటికి కూడా నోటీసులు ఇస్తారేమోనని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# పంచగ్రామాల సమస్యలను పరిష్కరించండి

**- గతంలో జీవోలు ఇచ్చినా అమలు కాలేదు**
**- అసెంబ్లలో ప్రస్తావించిన ఎమ్మెల్యే గంటా**
**- త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామన్న ఆనం**

సింహాచలం దేవస్థానం పరిసరాల్లోని పంచగ్రామాల సమస్యపై విశాఖపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఈ సమస్య పెండింగ్‌లో ఉందని అన్నారు. పంచగ్రామాలు ఐదు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయని తెలిపారు. 1996లో అప్పల సూర్యనారాయణ ఆధ్వర్యంలో హౌస్ కమిటీ ఏర్పాటు చేశారని... ఆ తర్వాత 2000లో 578 జీఓ, 2019లో 229 జీఓలు జారీ చేశారన్నారు. పంచగ్రామాల్లో రైతుల సమస్యలతో పాటు ఇళ్లు నిర్మించుకున్న వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన సభలో తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 100 రోజుల్లో సమస్య పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. 100 గజాల లోపు స్థలం ఉచితంగా ఇచ్చేలా, అంతకంటే ఎక్కువ ఉంటే డబ్బు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే చరిత్ర క్షమించదన్నారు. రెవెన్యూ, దేవాదాయ శాఖ మంత్రులు కూర్చొని తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈ ప్రశ్నకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమాధానమిస్తూ... గతంలో అసెంబ్లీ హౌస్ కమిటీ, మంత్రివర్గ ఉపసంఘాలు నివేదికలు ఇచ్చాయని తెలిపారు. వాటి ఆధారంగా జీఓలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే ఆలోచనలో ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర విధానం రూపొందించిం దని వివరించారు. కొందరి భూములు క్రమబద్ధీకరించిన తర్వాత మళ్లీ కోర్టుకు వెళ్లడంతో సమస్య తలెత్తిందని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాదాయ, రెవెన్యూ శాఖలను సమావేశపరిచి పరిష్కారం చూడాలని సీఎం సూచించారని తెలిపారు. సర్వే పూర్తి చేసిన తర్వాత 12,410 నివాసాలు ఉన్నట్లు తేలిందని, వాటన్నింటినీ క్రమబద్ధీకరించడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయని మంత్రి వివరించారు. అంతే విలువైన భూమిని సింహాచలం ఆలయానికి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించగా.. సింహాచలం ట్రస్టు సమ్మతించిందని మంత్రి తెలిపారు. భూమి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఈ విషయాలను హైకోర్టుకు అఫిడవిట్ రూపంలో అందజేశామని చెప్పారు. హైకోర్టు ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# పిపిపి విధానంలో వైద్య కళాశాల పూర్తి

**మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు**
**అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి**

పది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రెండు దశల్లో నిర్మాణం చేపడుతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. వైసీపీ అరాచక పాలన కారణంగా సీట్ల సంఖ్య 11కి పడిపోయిందని, అయినా బెదిరింపులు ఆపడం లేదని విమర్శించారు. జగన్ ప్రైవేట్ కళాశాలల మాదిరిగా ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు ఇచ్చారన్నారు. రాబోయే రెండేళ్లలో పీపీపీ విధానంలో కళాశాలలు పూర్తి చేస్తామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. నాలుగు రోజుల విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను మొదలుపెట్టారు. ప్రైవేట్ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయడంపై తణుకు ఎమ్మెల్యే ఏ.రాధాకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. వైసీపీ హయాంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రగల్భాలు పలికారని, చాలా కళాశాలల్లో పునాదులు కూడా పూర్తి కాలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం.. ప్రభుత్వ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో సీట్లు అమ్మే పద్ధతిని తెచ్చిందని.. 10 కళాశాలలను ఆరంభించి మధ్యలో వదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వం వైద్య కళాశాలల నిధులను దారి మళ్లించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టిందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలను పీపీపీ విధానంలో త్వరగా పూర్తి చేయాలని సంకల్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు. 'పీపీపీలో కళాశాలల నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎప్పుడు పూర్తవుతుందో చెప్పండి. వైసీపీ పెట్టిన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను ఏం చేస్తారు' అని ప్రశ్నించారు. పీపీపీలో కళాశాలలు తీసుకునే వారిని జగన్‌మోహన్ రెడ్డి బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిచ్చారు. 17 కళాశాలల్లో 11 నాబార్డు కింద, 3 కేంద్ర ప్రభుత్వం, 3 సాస్కి కింద మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు అని అన్నారు. జగన్ హయాంలో కేవలం రూ.15 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని.. అందులో పులివెందుల కళాశాలకే దాదాపు రూ. 500 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 900 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టిందని మంత్రి వివరించారు. కళాశాలలు నిర్మించామని వైసీపీ అసత్యాలు చెబుతోందని మంత్రి విమర్శించారు. పార్వతిపురంలో భూసేకరణ కూడా చేపట్టలేదని అన్నారు.

# అరుదైన ఆపరేషన్ గర్భాశయ ఫైబ్రైడ్ (లియోమయోమాస్) తొలగింపు.

» డాక్టర్ అన్నపూర్ణ సూపరింటెండెంట్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్, గజ్వేల్

**గజ్వేల్ మార్చి 3 (భారతీయ వెలుగు**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ గజ్వేల్ నందు ఒక అరుదైన గర్భాశయ ఫైబ్రైడ్ (లియోమయోమస్) శస్త్ర చికిత్స నిర్వచనం జరిగింది. (43) సంవ హైదరాబాద్ కు చెందిన ఒక మహిళ కు గర్భాశయశీ (గర్భసంచి) కండర గోడలలో పెరిగే కణిత రూ౦ పెద్ద గర్భాశయ ఫైబ్రైడ్ 24 వారంలో పరిమాణంలో 13/11/10 సెంటీమీటర్లు కలిగిన ఒక పెద్ద ఫైబ్రైడ్ లేదా లియోమయోమాస్ అని పిలవబడే అరుదైన ఆపరేషన్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ గజ్వేల్ నందు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ త్రివేణి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ప్రేమ్ కిషోర్, అనస్థీషియా డాక్టర్ మైపాల్, డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్స్ సునీత, సునీల్, థియేటర్ అసిస్టెంట్లు



సిహెచ్ ,వెంకట్ రాజకుమార్ పి. రాజు. అస్ర, పేషంట్ కేర్, యాదమ్మ ఒక టీం గా ఏర్పడి ఇంత పెద్ద ఫైబ్రేడ్ ను తొలగించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ

ఇది మహిళల గర్భాశయంలో కనిపించే అత్యంత అసాధారణమైన కణతి చాలామంది రోగులలో కనిపించవు అయినప్పటికీ 30% మంది అసాధారమైన గర్భాశయ రక్తస్రావము, కడుపులో నొప్పి, రక్తహీనతకు కారణం కావచ్చు, కట్టినొప్పి వంటి లక్షణాలు కనిపించవచ్చు, పొత్తికడుపు పూర్తిగా నిండడం వంటి భావన, అత్యవసర మూత్ర విసర్జన, నొప్పితో కూడిన అలసట, అంతర్గత రుతుస్రావము, దిగువ వెన్నునొప్పి, సంతానలేమి, బహుళ గర్భా స్రావాలు, గర్భ దారణలో ఇబ్బందులు కలుగుతాయని డాక్టర్ అన్నపూర్ణ తెలియజేసినారు ఎవరైనా ఈ ఇటువంటి లక్షణాలు ఉంటే మా హాస్పిటల్ ను సంప్రదించాల్సిందిగా కోరడం జరిగింది. పేషెంట్ కు సంబంధించిన బంధువులు హాస్పిటల్స్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# గజ్వేల్ లో ఘనంగా హోలీ సంబరాలు





**గజ్వేల్ మార్చి 03,భారతీయ వెలుగు**

గజ్వేల్ లో ఘనంగా హోలీ సంబరాలు పాల్గొన్న గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి గజ్వేల్ లోని క్యాంపు కార్యాలయంలో మరియు అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా హోలీ వేడుకలను జరపడం జరిగింది హోలీ వేడుకలలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి హోలీ సంబరాలలో వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొని రంగురంగుల రంగులతో హోలీ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాముని దానంతో ఈ వేడుకలు మొదలై చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హోలీ రంగులు అన్నారు. రంగులతో నిండిన ఈ హోలీ పండుగ మీ జీవితంలో ఆరోగ్యం, ఆనందంతోపాటు, శాంతి శ్రేయస్సును, కొత్త శక్తిని, కొత్త విజయాలను అందించాలని హోలీ రంగుల వలె మీ జీవితం కూడా సంతోషంగా రంగుమయం కావాలని హోలీ రంగులు మన జీవితంలో వెలిగించే రంగులు కావాలని కోరుకుంటూ ప్రజలందరికీ రంగురంగుల హోలీ పండుగ శు భాకాంక్షలు తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ గంగిశెట్టి చందన రవీందర్,వైస్ చైర్మన్ పద్మబాయి నర్సింగ రావు కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్, గోలి మమతా సంతోష్ కామినీ మురళి, అత్తెలి శ్రీనివాస్,కప్ప మమతా పోచయ్య, భాగ్యలక్ష్మి కనక సేన,నాయకులు మాజీ సర్పంచ్ చంద్ర శేఖర్, హనుమంత్ రెడ్డి , యూత్ అధ్యక్షుడు స్వామి చారి ,సాయి ,కుమార్ ,నరేష్ గౌడ్, బాకీ స్వామి,ప్రవీణ్ , లక్ష్మణ్ గౌడ్ ,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులున్నారు

# నెంటూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఏకగ్రీవం

- రాష్ట్రంలోనే ఎక్కువ జనాభా గల ముదిరాజ్ లు
- ముదిరాజ్ లను బి సి డి నుండి ఏ లోకి మార్చాలి

**గజ్వేల్ మార్చి 03 భారతీయ వెలుగు**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూర్ మధుర గ్రామమైన రామసాగర్ పల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఎన్నికలలో భాగంగా నూతనంగా అధ్యక్షులుగా లింగ శేఖర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా కిచ్చుగారి పాండు ముదిరాజ్ , పెద్దమ్మ తల్లి గుడి ఆలయ అధ్యక్షుడిగా నీరుడి నాగరాజు ఉపాధ్యక్షునిగా లింగ ఆంజనేయులును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లింగశేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ మా గ్రామంలో ముదిరాజ్ సంఘం సభ్యులందరం కలిసి



సొంతంగా ఎవరి ప్రమేయం లేకుండా పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మించుకున్నామని, ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా ముదిరాజులను గుర్తించలేదన్నారు. ఇప్పటికైనా మా గ్రామంలో ముదిరాజులను గుర్తించి మాకు ముదిరాజ్ భవనము నిర్మించుకోవడానికి నిధులను సమకూర్చాలని కోరారు. ముదిరాజ్ సంఘం సభ్యులకు ఇలాంటి ఆపద వచ్చిన వెను వెంటనే ఉంటూ సంఘం సభ్యుల సమక్షంలో తీరుస్తానని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజులకు ప్రత్యేక గుర్తింపు లేదని ముదిరాజులందరినీ ఐక్యతతో ఉండాలని, రాజకీయ కతీతంగా అభివృద్ధి బాటలో ముందుకు నడవాలని సూచించారు.ముదిరాజులను బి సి డి నుండి బి సి ఏ కు మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ముదిరాజ్ సంగం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులుగా లింగ కిష్టయ్య ముదిరాజ్, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు నీరుడి చంద్రం ముదిరాజ్, మత్స్యసహకార సంఘం అధ్యక్షులు కిచ్చుగారి స్వామి ముదిరాజ్, పెద్దమ్మతల్లి గుడి మాజీ అధ్యక్షులు, నెంటూర్ గ్రామ తాజా వార్డు సభ్యులు కిచ్చు రమేష్ ముదిరాజ్, నీరుడు బిక్షపతి ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ లింగ నాగరాజు ముదిరాజ్, కోశాధికారి జగ్గారి జానీ ముదిరాజ్, సభ్యులు జగ్గారి కుమార్ ముదిరాజ్, నిరుడి భాస్కర్ ముదిరాజ్ లు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

- మొన్న కె.ఎం. గౌరీష్... ఇప్పుడు మన్నె రాజు కాంగ్రెస్ గూటికి

**కుత్బుల్లాపూర్, మార్చి 4 భారతీయ వెలుగు**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో కీలక పాత్ర పోషించిన మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, తాజాగా సీనియర్ నాయకుడు, మేడ్చల్––మల్కాజ్‌గిరి జిల్లా మత్స్యశాఖ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు కూడా అదే బాట పట్టారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మన్నె రాజు తెలిపారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు, ప్రజల ఆశయాలు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో మన్నె రాజుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల వరుసగా జరుగుతున్న ఈ చేరికలు కుత్బుల్లాపూర్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్‌లో అసంతృప్తి పెరుగుతోందా? లేక కాంగ్రెస్ బలపడుతోందా? అన్న ప్రశ్నలు స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు నియోజకవర్గ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు





# నిజాంపేట్‌లో 13 ఎకరాల లావణి ప్రభుత్వ భూమికి ?5 కోట్ల టోకెన్?

- భారీ అక్రమాల ప్రయత్నం జరుగుతోందని ఆకుల సతీష్ ఆరోపణ
-- ఎమ్మార్వోకు లిఖిత ఫిర్యాదు

**నిజాంపేట్, మార్చి 4 భారతీయ వెలుగు**

నిజాంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 233/21, 22, 23, 24, 25, 26లలో ఉన్న సుమారు 15 ఎకరాల ప్రభుత్వ లావణి భూమిపై భారీ అక్రమాల ప్రయత్నం జరుగుతోందని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ ఆరోపించారు. ఈ భూమిలో దాదాపు 13 ఎకరాలపై అధికార పార్టీ నేతల సహకారంతో ఇద్దరు పెద్ద బిల్డర్లు రూ.5 కోట్ల టోకెన్ అమౌంట్ చెల్లించి స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నట్లు తనకు సమాచారం అందిందని తెలిపారు. ఈ సందర్భంగా



ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఇదే సర్వే నెంబర్లలోని 233/22లో సుమారు 2 ఎకరాల ప్రభుత్వ భూమిని తప్పుడు ఎన్‌ఓసీ (చీూజ) ఆధారంగా కల్వకుంట్ల కన్నారావు 2023లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం మిగిలిన సర్వే నెంబర్లు 233/23, 24, 25, 26, 27లలోని 13 ఎకరాల ప్రభుత్వ లావణి భూమిని నిర్మాణాలకు అనుకూలంగా మారుస్తామని హామీ ఇస్తూ కొందరు ప్రభావశీలులు బిల్డర్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.300 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తూ, ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రైవేట్ వ్యక్తులు హైకోర్టులో పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు. గతంలో కూడా ఎకరం పైచిలుకు భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు. ఈ అంశంపై సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు, అలాగే బాచుపల్లి ఎమ్మార్వో వాణిరెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించినట్లు ఆకుల సతీష్ వెల్లడించారు. ప్రభుత్వాన్ని కోరుతూ ఆయన చేసిన డిమాండ్లు ఇవీ:

స్థలంలో ఏర్పాటు చేసిన చిన్నచిన్న షెడ్లు, డబ్బాలు వెంటనే తొలగించాలి.

ప్రభుత్వ భూమి మరింత ఆక్రమణకు గురికాకుండా హైడ్రా ద్వారా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. కోర్టులో బలమైన కౌంటర్లు దాఖలు చేసి ప్రభుత్వ హక్కులను కాపాడాలి. భవిష్యత్తులో ఈ స్థలాన్ని నిజాంపేట్ సర్కిల్ ప్రజల అవసరాల కోసం స్టేడియం, ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రభుత్వ కాలేజీ నిర్మాణానికి కేటాయించాలి.

ఈ కార్యక్రమంలో ప్రసాద్, అరుణ్ రావు, నవీన్, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి స్పష్టమైన చర్యలు తీసుకోవాలన్నది స్థానికుల అభిప్రాయం.

# కుటుంబ సభ్యులను పరామర్శించిన వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్ మార్చి 04, భారతీయ వెలుగు**

సిద్దిపేట గజ్వేల్ మండలంలోని సింగాటం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభాకర్ మరియు ప్రసాద్ తండ్రి పూదూరి వంజరి పోచయ్య మృతి చెందారు విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతునితో కోరుకున్నారు వారి వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెండే మధు, గజ్వేల్ మున్సిపల్ ఆరో వార్డు కౌన్సిలర్ స్వప్న సురేష్, తాటికొండ మధుసూదన్ రెడ్డి, బొగ్గుల సురేష్ గొడుగు స్వామి మల్లేశం శ్రీనివాస్ ఆందోలు కిష్టారెడ్డి నర్సింలు లింగాగౌడ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులున్నారు

# షార్ట్ వీడియో పోటీల విజేతలకు 'వండర్లా' ఉచిత కూపన్ల పంపిణీ: సీపీ రష్మీ పెరుమాళ్

- సిద్దిపేట పోలీస్ కమిషనర్,రష్మీ పెరుమాళ్,

**సిద్దిపేట మార్చి 04, భారతీయ వెలుగు**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా వేదికగా నిర్వహించిన మొదటి విడత ఆన్‌లైన్ షార్ట్ వీడియోల పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్రీమతి రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ చేతుల మీదుగా బహుమతులు అందజేసిన విషయం తెలిసిందే. విజేతలకు



1వ, 2వ 3వ బహుమతులతో పాటు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.సిద్దిపేట పోలీసులు రూపొందించిన ఈ వినూత్న కార్యక్రమానికి ఆకర్షితులైన ప్రముఖ వినోద సంస్థ 'వండర్లా' , విజేతలకు ఉచిత ప్రవేశ కూపన్లను స్పాన్సర్ చేసింది. సీపీ సమక్షంలో ఈ కూపన్లను విజేతలకు పంపిణీ చేయడం జరిగింది.షార్ట్ వీడియో కాంటెస్ట్ 2.0 ప్రారంభం మొదటి విడతకు వచ్చిన అనూహ్య స్పందనతో, ఇప్పుడు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షార్ట్ వీడియో కాంటెస్ట్ 2.0 ను ప్రారంభించడం జరిగింది. సమాజంలో చైతన్యం నింపేందుకు యువత, కంటెంట్ క్రియేటర్లు మరియు ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ పోటీలో పాల్గొనాలని సీపీ పిలుపునిచ్చారు.పోటీ అంశాలు:

1. సైబర్ నేరాలపై అవగాహన
2. మహిళల భద్రత మరియు వేధింపుల నిరోధం
3. ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన
4. ఈవ్ టీజింగ్ నిరోధం
5. మాదక ద్రవ్యాల నిర్మూలన

"సామాజిక బాధ్యతతో కూడిన వీడియోలను రూపొందించి, సోషల్ మీడియాలో మా అధికారిక ఖాతాలను ట్యాగ్ చేయండి. ప్రతిభావంతులకు ఆకర్షణీయమైన బహుమతులు అందించబడతాయి.

యువత తమ సృజనాత్మకతతో సమాజ మార్పులో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కోరడమైనది.

# ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా పోయిల కనకరాజు ముదిరాజ్ ఏకగ్రీవ ఎన్నిక

**మర్కుక్ మార్చి 04, భారతీయ వెలుగు**



సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చెబర్తి గ్రామ ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా పోయిల కనకరాజు ఉపాధ్యక్షులుగా తోట బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దేశమైన రమేష్, కార్యదర్శిగా కొంతం కనకయ్య, సంయుక్త కార్యదర్శులుగా గుర్రాల స్వామి, సలహాదారులుగా భీమరి వరదరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన గ్రామ ముదిరాజ్ బంధువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ముదిరాజుల ఐక్యత కు సంఘం అభివృద్ధికి కులస్తుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, పెద్దమ్మతల్లి అనుగ్రహంతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో తోట సాయిలు,దేశమైన నర్సింలు, పోయిల మల్లేశం, పోయిల ఆంజనేయులు, తోట సత్యం, గుర్రాలఆంజనేయులు,సురేష్,ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఇన్ స్టాలో పరిచయమైన ధనవంతుడి కోసం ఏపీకి వచ్చిన జార్ఖండ్ వివాహిత..

- ఆ తర్వాత అసలు ట్విస్ట్..

**మచిలీ పట్నం ప్రతినిధి భారతీయ వెలుగు**

సోషల్ మీడియా పరిచయాలు ఎలాంటి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. అనైతిక సంబంధాలు, అసాంఘిక పనులకు సోషల్ మీడియాను మాధ్యమంగా వాడుకుంటున్నారు కొందరు.తాజాగా సోషల్ మీడియా పరిచయం ఓ వివాహితను దారి తప్పేలా చేసింది. పెళ్లై, పిల్లలున్న వివాహిత సోషల్ మీడియా మాయలో పడింది. ఏపీలో




పరిచయం అయిన వ్యక్తిని నమ్మి.. అతని ప్రేమలో మునిగిపోయింది. కానీ ఆ నమ్మకంలో చేసిన తప్పు.. చివరకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే.. జార్ఖండ్‌కు చెందిన 30 ఏళ్ల వివాహితకు ఇన్ స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు గంటల కొద్దీ చాటింగ్‌లో మునిగితేలారు. ఆపై ఆడియో, వీడియో కాల్స్ కూడా నడిచాయి. వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. లితనను ధనవంతుడిగా, అనుభవం ఉన్న వ్యాపారవేత్తగా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి మాటలను ఆమె పూర్తిగా నమ్మేసింది. ..

TGTEL/26/A0320
BVBV భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
గురువారం మార్చి 05, 2026

# కెనడాలో చదువు..

## భారత విద్యార్థులకు భారీగా స్కాలర్‌షిప్‌లు







ఇంటర్నెట్ డెస్క్: ఉన్నత చదువుల కోసం తమ దేశానికి వచ్చే భారతీయ విద్యార్థులకు కెనడా (ౕబఎఎ అఅ ఝఝఝ) తీపి కబురు చెప్పింది. ప్రతిభ కలిగినవారికి మరిన్ని స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు ప్రకటించింది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవడం, విద్యారంగంలో దీర్ఘకాలిక సహకారం, ప్రతిభ కలిగిన విద్యార్థులను ఆకర్షించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు కెనడా ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. కెనడా (ఝఝఝ) ప్రధాని మార్క్ కార్నీ భారత పర్యటన అనంతరం ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

పరిశోధన, హైబ్రిడ్ క్యాంపస్‌లు, ఏఐ కేంద్రాల ఏర్పాటు కోసం ఇరుదేశాల యూనివర్సిటీల మధ్య 13 ఒప్పందాలు జరిగినట్లు కెనడా వెల్లడించింది. ఐఐటీ తిరుపతి, ఐసర్–తిరుపతి భాగస్వామ్యంతో డల్హౌసీ యూనివర్సిటీ ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ టొరంటో, మెక్‌గిల్ యూనివర్సిటీల ఎక్సలెన్స్ కేంద్రాలు కూడా భారత్‌లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. 220 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు యూనివర్సిటీ ఆఫ్ టొరంటో ద్వారా పూర్తి స్థాయిలో స్కాలర్‌షిప్‌లు అందించేందుకు 25 మిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొంది. గత ఐదేళ్లలో 700కుపైగా స్కాలర్‌షిప్‌లు అందించగా.. ఈ సారి మరింత పెంచనున్నట్టు వెల్లడించింది. ఇండో–పసిఫిక్ వ్యూహంలో భాగంగా 10 మిలియన్ డాలర్లతో స్కాలర్‌షిప్‌లు అందిస్తామని కెనడా వెల్లడించింది. భారత్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు 85 మంది కెనడా విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామని తెలిపింది. అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, ఇతర ఖర్చులన్నీ భరించనున్నట్లు సమాచారం. స్కాలర్‌షిప్‌లకు సంబంధించి అర్హతలు, ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయనే విషయాన్ని యూనివర్సిటీ ఆఫ్ టొరంటో త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది.

# సోషల్ మీడియాలో అలాంటి క్లెయిమ్స్‌తో జాగ్రత్త: ఎన్‌టీఏ



టెలిగ్రామ్ సహా ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా “పేపర్ లీక్” పేరిట విద్యార్థుల్ని తప్పుదారి పట్టించే ప్రచారం జరుగుతోందని ఎన్‌టీఏ(చీ్టూ) ఆందోళన వ్యక్తంచేసింది. ఈ విషయాన్ని తాము గుర్తించినట్లు తెలిపింది. ప్రశ్నపత్రాలను ఇస్తామంటూ చేస్తున్న క్లెయిమ్‌లను విద్యార్థులెవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. ఏ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను టెలిగ్రామ్, వాట్సప్ లేదా మరే ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ఇవ్వడం గానీ, విక్రయించడం గానీ, షేర్ చేయడం, లీక్ చేయడం వంటివి జరగవని స్పష్టం చేసింది. అలాంటి మోసపూరిత క్లెయిమ్‌లను నమ్మి ఎవరూ డబ్బులు పోగొట్టుకోవద్దని విద్యార్థులకు విజ్ఞప్తి చేసింది.

ఇవన్నీ విద్యార్థుల్ని మోసగించి డబ్బులు కొల్లగొట్టే ఉద్దేశంతో చేసే ప్రయత్నాలేనని అప్రమత్తం చేసింది. ఈ తరహా ప్రకటనలు తరచూ డబ్బులు లేదా వ్యక్తిగత వివరాలను అడుగుతుంటాయని తెలిపింది. అందువల్ల ఇలాంటివి నమ్మడం వల్ల ఆర్థిక నష్టమే కాకుండా తప్పుడు సమాచారం వల్ల ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించింది. విద్యార్థులు అధికారిక, కచ్చితమైన సమాచారం కోసం ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్ https://nta.ac.in/ను మాత్రమే సంప్రదించాలని కోరింది.



## ఒక్క క్షణం ఆలోచించండి

### క్షణికావేశంలో నిర్ణయం వద్దు
### కన్నవారికి వేదన మిగల్చొద్దు

అనకాపల్లి పట్టణం, చింతపల్లి, న్యూస్‌టుడే : ‘మమ్మీ.. డాడీ.. ప్రేమించిన వ్యక్తిని మరచిపోలేకపోతున్నా. మిమ్మల్ని మోసం చేయలేను. ప్రేమించిన అబ్బాయిని విడిచి ఉండటం నావల్ల కావడం లేదు. ఏదోలా ఉంది. ఏమీ అనుకోవద్దు. చెల్లి, తమ్ముడు జాగ్రత్త’ అంటూ విశాఖలో ఫిజియోథెరపీ విద్యార్థిని రజిని (21) ఈ నెల 25న ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ప్రేమించిన మరదలితో పెళ్లికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదన్న కారణంతో చింతపల్లి సాయినగర్‌కి చెందిన మోస సాయి (20) ఈ నెల 26న చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.

పిల్లలు పుట్టగానే తల్లినయ్యాయని అమ్మ ఎంతో మురిసిపోతుంది. తనకు వారసుడొచ్చాడని నాన్న ఎంతో ఆనందిస్తారు. వారు పెరిగి పెద్దవారై తమ కలలను నిజం చేస్తారన్న ఆశతో బతుకుతారు. ప్రేమో, మరో కారణంతోనో ప్రాణాలు తీసుకుంటే తల్లిదండ్రుల కడుపుకోత అంతా ఇంతా కాదు. పేగు బంధం దూరమైతే కలిగే బాధ అది అనుభవించే వారికే తెలుస్తుంది.

అమ్మ తిట్టిందనో, నాన్న కొట్టారనో, పరీక్ష తప్పారనో, ఎంత చదివినా బుర్రకెక్కడం లేదనో, భార్య కోప్పడిందనో, ప్రేమించిన యువతితో పెళ్లి జరగలేదని, కోరుకున్న వాడితో పెళ్లి కాలేదని.. ఇలా చిన్న చిన్న కారణాలకే తీవ్ర మనస్తాపానికి గురై ప్రాణాలు తీసుకుంటూ బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. చింతపల్లి మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కప్పగొంది గ్రామంలో కందుల చంద్రకళ (22) సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తోందని ఆమె తల్లి గట్టిగా మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.

TGTEL/26/A0320
BVBV భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
గురువారం మార్చి 05, 2026

# కీలక పోరుకు టీమిండియా సిద్ధం




## నేడు వాంఖడే మైదానం వేదికగా సెమీఫైనల్-2
## ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న భారత్
## అభిషేక్ శర్మపై వేటు పడే అవకాశం!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా గురువారం రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే సెమీఫైనల్-2లో ఇంగ్లండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్ చేరనుండటంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా సన్నదమవుతున్నాయి. వెస్టిండీస్‌తో తమ ఆఖరి సూపర్-8 మ్యాచ్‌లో అసాధారణ ప్రదర్శనతో విజయం సాధించిన భారత్.. అదే జోరు కనబర్చి ఇంగ్లండ్‌ను మట్టికరిపించాలనుకుంటుంది. తద్వారా టీ20 ప్రపంచకప్ 2022 సెమీఫైనల్లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది. బలబలాల పరంగా ఇరు జట్లు పటిష్టంగా ఉండటంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. లీగ్ దశను భారత్ అజేయంగా ముగిస్తే.. సూపర్-8ను ఇంగ్లండ్ అజేయంగా ముగించి సెమీస్‌కు అర్హత సాధించింది. పేలవ ప్రదర్శనతో జట్టుకు భారంగా మారిన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను తుది జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చాడు. విండీస్‌తో మ్యాచ్‌లో రెండు సునాయస క్యాచ్‌లను వదిలేసాడు. ఇప్పటి వరకు ఆడిన 6 మ్యాచ్‌ల్లో మూడు సార్లు డకౌట్ అయిన అభిషేక్ శర్మ 80 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉంది. ఆఫ్ స్పిన్నర్‌ను ఎదుర్కోవడంలో అభిషేక్ శర్మ తడబడుతున్నాడు. ఈ క్రమంలోనే అతన్ని పక్కనపెట్టి రింకూ సింగ్‌ను ఆడించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. కానీ టీమ్‌మేనేజ్‌మెంట్ ఆ సాహసం చేయకపోవచ్చు.

ఎలాంటి మార్పులు లేకుండా గత కాంబినేషన్‌నే కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గత మూడు మ్యాచ్‌ల్లో తీవ్రంగా తడబడ్డాడు. ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. దాంతో వరుణ్ చక్రవర్తిని తప్పించి కుల్దీప్ యాదవ్‌ను ఆడిస్తారా? అనే చర్చ కూడా జరుగుతుంది. కానీ ఇంగ్లండ్‌పై వరుణ్ చక్రవర్తీకి మెరుగైన రికార్డ్ ఉంది. కాబట్టి అతన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. అయితే వాంఖడే పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. అలా అని కుల్దీప్ యాదవ్‌ను ఆడిస్తే టీమిండియా బ్యాటింగ్ డెప్త్ తగ్గనుంది. కాబట్టి మరోసారి కుల్దీప్ యాదవ్‌కు నిరాశే ఎదురవ్వనుంది. టీ20ల్లో ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో ఆడితే ప్రయోజనం ఉంటుందని టీమిండియా మేనేజ్‌మెంట్ గట్టిగా నమ్ముతుంది. వ్యూహాత్మకంగా కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే వరుణ్ చక్రవర్తీ, అర్ష్‌దీప్ సింగ్‌లో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. బ్యాటింగ్ లైనప్‌లో ఎలాంటి మార్పులు జరిగే ఛాన్స్ లేదు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ ఆడనున్నారు. లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం సంజూను తిరిగి ఆడించగా.. అతను కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు. అభిషేక్ శర్మ కూడా చెలరేగితే టీమిండియాకు తిరుగుండదు. ఇషాన్ కిషన్, సూర్య, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ మిడిల్, లోయార్డర్‌లో ఆడనున్నారు. రింకూ సింగ్ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. సూర్య ఒత్తిడిని పక్కనపెట్టి స్వేచ్ఛగా ఆడాల్సిన అవసరం ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ పేస్ బాధ్యతలు పంచుకోనుండగా.. హార్దిక్ అతనికి అండగా నిలవనున్నాడు. శివమ్ దూబేతో బౌలింగ్ వేయించలేని పరిస్థితి నెలకొంది. ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ ఎవరా? అనేది టీమిండియాకు సవాల్‌గా మారింది. సిరాజ్‌కు మరోసారి మొండి చెయ్యే ఎదురు కానుంది.




# సఫారీలను చిత్తు చేసి టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు కివీస్

కోల్‌కతా: ఇప్పటి వరకు అజేయంగా సెమీస్‌కు చేరుకున్న జట్టు దక్షిణాఫ్రికా.. కీలక పోరులో మాత్రం ప్రత్యర్థి దూకుడు ముందు నిలవలేకపోయింది. బ్యాటింగ్‌లో కాస్త పోరాడినా.. బౌలింగ్‌లో మాత్రం చేతులెత్తేసింది. వివిధ సమీకరణాలతో అనూహ్యంగా సెమీస్ బెర్తును దక్కించుకున్న న్యూజిలాండ్ మాత్రం అన్ని విభాగాల్లో పూర్తి ఆధిపత్యం సాధించి టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంది.

తొలి సెమీస్‌లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన సఫారీ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో కివీస్ కేవలం ఒక్క వికెట్‌ను మాత్రమే కోల్పోయి 12.5 ఓవర్లలో 173 పరుగులు చేసి విజయం సాధించింది. టిమ్ సీఫెర్ట్ (58)తో కలిసి ఫిన్ అలెన్ (100బి: 33 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సలు) దూకుడు దెబ్బకు సఫారీ బౌలర్లు కుదేలయ్యారు. ఏమాత్రం పోటీ ఇవ్వలేక ఘోర ఓటమిని చవిచూశారు. దక్షిణాఫ్రికా బౌలర్ రబాడ ఒక వికెట్ తీశాడు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన ఫిన్ అలెన్ కివీస్ విజయంలో కీలక పాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గురువారం భారత్-ఇంగ్లాండ్ మధ్య జరిగే సెమీస్-2 విజేతతో ఆదివారం కివీస్ ఫైనల్‌లో తలపడనుంది.

### వచ్చీ రావడంతోనే..

కోల్‌కతా పిచ్ లక్ష్య ఛేదనకు అనుకూలంగా ఉంటుందని మరోసారి నిరూపితమైంది. అందుకే టాస్ నెగ్గిన కివీస్ బౌలింగ్ ఎంచుకుంది. సఫారీ జట్టును 169 పరుగులకే కట్టడి చేసి ఛేదనకు దిగిన బ్లాక్‌క్యాప్స్‌కు అదిరే ఆరంభం దక్కింది. ఓపెనర్లు సీఫెర్ట్‌తో కలిసి ఫిన్ అలెన్ శతక భాగస్వామ్యం నిర్మించాడు. ఏదశలోనూ దక్షిణాఫ్రికా బౌలర్లు ప్రభావం చూపించలేదు. మార్కో యాన్సెన్ (0/53) తేలిపోయాడు. బ్యాటింగ్‌లో హాఫ్ సెంచరీ చేసి జట్టును కాపాడిన యాన్సెన్.. బౌలింగ్‌లో మాత్రం ధారాళంగా పరుగులు సమర్పించాడు. రెండేసి ఓవర్లు వేసిన బాష్ (0/35), ఎంగిడి (0/22) కివీస్ బ్యాటర్ల దూకుడు ముందు నిలవలేకపోయారు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో 33 బంతుల్లోనే ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఫిన్ అలెన్ ఊచకోత ముందు సఫారీ బౌలర్లు చిన్నబోయారు.

### యాన్సెన్ ఒక్కడే..

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు శుభారంభం దక్కలేదు. 12 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయింది. క్వింటన్ డికాక్ (10), రైన్ రికెల్టన్ (0) వరుస బంతుల్లో పెవిలియన్‌కు చేరారు. కెప్టెన్ ఐదెన్ మార్‌క్రమ్ (18) కూడా ఎక్కువ సమయం నిలవలేదు. డేవాల్డ్ బ్రెవిస్ (34), ట్రిస్టన్ స్టబ్స్ (29) కాసేపు ఫర్వాలేదనిపించారు. కానీ, ఆఖర్లో మార్కో యాన్సెన్ (55బి: 30 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చాలా దూకుడుగా ఆడాడు. లేకపోతే దక్షిణాఫ్రికా పరిస్థితి ఇంకా దారుణంగా ఉండేది. కివీస్ బౌలర్లలో రచిన్ రవీంద్ర 2, మాట్ హెన్రీ 2, కోలె మెక్‌కాంచి 2.. లాకీ ఫెర్గూసన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ తీశారు.



### మళ్లీ అదే ముద్ర!

గత టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో విజేతగా నిలిచిన దక్షిణాఫ్రికా 'చోకర్స్' అని తమపై ఉన్న ముద్రను తొలగించుకున్నారు. ఇప్పుడు మళ్లీ పెద్ద మ్యాచుల్లో విఫలమవుతున్నారని.. 'చోకర్స్' అనే పదం వారికి సరిపోతుందని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి.

## అలెన్ 'ఫాస్టెస్ట్' సెంచరీ..




Publishers & Owner Gunnala lavanya PLOT NO 332/P, ROAD NO 13, KRUSHI NAGAR, MADINAGUDA, MIYAPUR, SERILINGAMPALLY, RANGAREDDY, TELANGANA-500049. RNI: TGTEL/26/A0320. Printers VASISTA PRINTERS, 18-97#306, 3rd loor, Rajini gandha Complex, kamala Nagar, Chaitanyapuri, Rangareddy, Telangana, 500060 Editor Gunnala Anilreddy Phone 9642844456, 9705043131